ఆదివారం 18 అక్టోబరు 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**రాయచోటిలో**

## పంజాబ్ ముఠా!

**10 మంది గన్ గ్యాంగ్‌ను రంగంలోకి దింపిన జగన్**

- వివరాలు 5 లో..

## అభ్యర్థుల ఎంపికలో

# అన్ని వర్గాలకు అవకాశం

- **మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో గెలిచి తీరాలి**
- **2024 మించి ఓట్ల శాతం పెరగాలి**
- **గొడ్డలి పార్టీ కుట్రలను తిప్పికొట్టాలి**
- **మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం**





అమరావతి(చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలపై టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సోషల్ రీ ఇంజనీరింగ్ ద్వారా అన్ని వర్గాలకూ సమాన అవకాశాలు కల్పించాం. క్షేత్రస్థాయిలో కూటమి నేతలు మిత్ర ధర్మం పాటిస్తూ అందరినీ కలుపుకుని వెళ్లాలని సూచించారు. పార్టీ నుంచి పోటీ చేసే 11 మేయర్ స్థానాలకు 11 సామాజిక వర్గాలకు కేటాయిస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లో 2024 ఎన్నికల ఫలితాలకు మించిన స్థాయిలో ఓట్ల శాతం పెరగాలని స్పష్టం చేశారు. గెలుస్తామన్న ధీమాతో వ్యవహరించకుండా అంతా క్షేత్రస్థాయిలో పర్యటించి ఫలితాలు సాధించాల్సిందేనని దిశానిర్దేశం చేశారు. పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిచి తీరాలని స్పష్టం చేశారు. సోషల్ రీ ఇంజనీరింగ్ ద్వారా సీట్ల కేటాయింపు జరిగింది. జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాం. ప్రజాభిప్రాయం, క్యాడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే అభ్యర్థుల ఎంపిక చేపట్టాం. ప్రజాభిప్రాయ సేకరణలో 50శాతం కంటే ఎక్కువగా ఉన్న వారినే అభ్యర్థులుగా ఎంపిక చేశామని వివరించారు. కొంతమంది అభ్యర్థిత్వాలపై 80 శాతానికి మించిన మద్దతు లభించింది. కూటమి పార్టీల మనోభావాలను గౌరవించాలి.. మిత్ర ధర్మం పాటించాలి. ఐక్యంగా ముందుకువెళ్లాలని సూచించారు. ఒకటి, రెండు చోట్ల వచ్చిన సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా వైసీపీ వ్యవహరిస్తోంది. గొడ్డలి పార్టీ చర్యలను గమనిస్తూ ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలి.. ఆ పార్టీ కుట్రలను సమర్థంగా తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు.

## పురపోరుకు టీడీపీ రెండు, మూడు జాబితాల విడుదల

**34 మంది అభ్యర్థుల ఎంపిక**

**అన్ని వర్గాలకు ప్రాధాన్యం**

అమరావతి(చైతన్యరథం): పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి టీడీపీ రెండు, మూడు జాబితాలలో 34 మంది అభ్యర్థులను ప్రకటించింది. రెండో జాబితాలో మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదాతోపాటు 21మున్సిపల్ చైర్మన్ అభ్యర్థుల జాబితా విడుదలచేసింది. ఇక మూడో జాబితాలో ఇద్దరుమేయర్, 10 మున్సిపల్ చైర్మన్ స్థానాలతో 12మంది అభ్యర్థులను ఖరారు చేసింది. గుంటూరు మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, ఒంగోలు మేయర్ అభ్యర్థిగా నల్లమిల్లి శ్రీశిల్ప పేర్లను అధిష్ఠానం ఎంపిక చేసింది. వీటితోపాటు చీమకుర్తి, కనిగిరి, మండపేట, నూజివీడు, పలమనేరు, పార్వతీపురం, పిడుగు రాళ్ల, పుంగనూరు సత్తెనపల్లి, వినుకొండ మున్సిపాలిటీలకు కూడా చైర్మన్ల పేర్లను ప్రకటించింది. ఇప్పటివరకు మొత్తం మూడు జాబితాల్లో కలిపి 10మంది మేయర్ అభ్యర్థులు, 60మంది చైర్మన్ అభ్యర్థులతో 70మందిని టీడీపీ ప్రకటించింది.

### టీడీపీ అభ్యర్థుల రెండో జాబితా(22)

| | |
|---|---|
| మచిలీపట్నం కార్పొరేషన్ | - షేక్ అబ్దుల్ అబిదా |
| ఆకివీడు | - నిలోఫర్ షేక్ |
| బేతంచెర్ల | - ఐ.లోకేష్ గౌడ్ |
| బుచ్చిరెడ్డిపాలెం | - దొడ్ల విజయలక్ష్మి |
| చీరాల | - హనీ స్పందన |
| డోన్ | - కోట్ల సుజాతమ్మ |
| గుత్తి | - గోవిందరాజులు తమిళ్‌సెల్వి |
| గుంతకల్లు | - యశోద |
| జంగారెడ్డిగూడెం | - రొంగల అనూష |
| కదిరి | - షేక్ సమీరా |
| కళ్యాణదుర్గం | - బుట్న లక్ష్మి |
| కొండపల్లి | - కన్నెకంటి అమూల్య |
| కొవ్వూరు | - జొన్నలగడ్డ రాధారాణి |
| నాయుడుపేట | - షకీరా |
| నందిగామ | - శాకమూరి వంశీధర్ |
| నందికొట్కూరు | - ఈ.ఎం.సబురున్నీసా |
| నర్సీపట్నం | - చింతకాయల పద్మావతి |
| ప్రొద్దుటూరు | - నంద్యాల రాఘవరెడ్డి |
| వెంకటగిరి | - దొంతు శారద |
| ఉయ్యూరు | - చేదుర్తిపాటి ప్రవీణ్ కుమార్ |
| ఏలేశ్వరం | - యార్లగడ్డ అక్షిత |
| ఎమ్మిగనూరు | - మాచాని సునీత |

### టీడీపీ అభ్యర్థుల మూడో జాబితా(12)

| | |
|---|---|
| గుంటూరు కార్పొరేషన్ | - కోవెలమూడి లక్ష్మీ అపర్ణ |
| ఒంగోలు కార్పొరేషన్ | - నల్లమిల్లి శ్రీశిల్ప |
| చీమకుర్తి | - శిద్దా సుధాకర్ |
| కనిగిరి | - అచ్చాల తిరుపతమ్మ |
| మండపేట | - వేగుళ్ల అజయకుమార్ |
| నూజివీడు | - బర్రె ఇళయరాజా |
| పలమనేరు | - సి.రాజ్యలక్ష్మి |
| పార్వతీపురం | - బెలగాం కరుణ |
| పిడుగురాళ్ల | - షేక్ బాబావలి |
| పుంగనూరు | - నయీమా తాజ్ |
| సత్తెనపల్లి | - మారెళ్ల రామాంజనేయులు |
| వినుకొండ | - చెరుకుంపాలెం షమీమ్‌ఖాన్ |

## గొడ్డలి పార్టీ హింస రచన

- పులివెందులలో అరాచక పర్వం
- పోలీసులపైనే రాళ్ల దాడి

4





## నామినేషన్ కేంద్రాల వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై సస్పెన్షన్, బదిలీ వేటు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా



3

## సీఎం చంద్రబాబును కలిసిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్





అమరావతి(చైతన్యరథం): సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీ సీఎం చంద్రబాబుతో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాజధాని అమరావతి నిర్మాణం సహా రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి సీఎం చంద్రబాబు ఆయనకు వివరించారు. ఉండవల్లి నివాసానికి వచ్చిన ఆయనకు మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు. యువగళం పాదయాత్ర పుస్తకాన్ని అందజేశారు. తన పాద యాత్రకు సంబంధించిన అంశాలను మధ్యప్రదేశ్ సీఎంకు వివరించారు.

## వైసీపీ దౌర్జన్యాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

- ఎంపీ మిథున్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలి
- ఇతర రాష్ట్రాల రౌడీలతో కుట్రలకు జగన్ పన్నాగం
- పంజాబ్ ముఠాపై సమాధానం చెప్పాలి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య

2



# ఓటమి భయంతోనే దాడులు

- పక్క రాష్ట్రాల గూండాలతో టీడీపీ శ్రేణులపై గొడ్డలి పార్టీ దాడులు
- వీధి రౌడీలా పేట్రేగిన ఎంపీ మిథున్ రెడ్డి
- గొడ్డలి పార్టీ దౌర్జన్యాలపై ఈసీకి ఫిర్యాదు చేశాం
- పులివెందుల సహా స్థానిక ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్
- ఇక వైసీపీ దుకాణం మూసుకోవాల్సిందే
- జగన్ రెడ్డిపై మంత్రి సవిత ఫైర్

పెనుకొండ/శ్రీసత్యసాయి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి జగన్, గొడ్డలి పార్టీ నాయకులు దాడులకు తెగబడుతున్నారని రాష్ట్ర బీసీ,ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. పక్కరాష్ట్రాల నుంచి గూండాలను తీసుకొచ్చి, టీడీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి వీధి రౌడీలా వ్యవహరించారు.. గొడ్డలి పార్టీ నాయకులు ఎన్ని బెదిరింపులు, దాడులకు పాల్పడినా భయపడేది లేదు...పులివెందుల సహా స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వీప్ చేయబోతున్నామని ధీమా వ్యక్తంచేశారు. పోలీసులు పూర్తి స్వేచ్ఛతో విధులు నిర్వర్తిస్తున్నారని స్పష్టం చేశారు. ఒకవైపు ఈడీ దాడులు, మరోవైపు వైఎస్ వివేకా హత్య కేసు వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపుతుండడంతో జగన్‌రెడ్డిలో ఆందోళన మొదలైందన్నారు. త్వరలో వైసీపీ దుకాణం మూత పడటం ఖాయమని మంత్రి సవిత జోస్యం చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నామినేషన్ల ప్రారంభమైన మొదటిరోజే గొడ్డలి పార్టీ నాయకులు పెట్రేగిపోయారన్నారు. పక్కరాష్ట్రాల నుంచి గూండాలను తీసుకొచ్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారన్నారు. తిరుపతి, రాయచోటి, పుంగనూరు, ధర్మవరంతో పాటు పలు చోట్ల వైసీపీ కార్యకర్తలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు.

**వీధి రౌడీలా ఎంపీ మిథున్ రెడ్డి...**

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిపోవడంతో వైసీపీ నాయకులు విచక్షణ మరిచి పోయి, దాడులకు తెరతీశారని మంత్రి సవిత మండి



పడ్డారు. ఎంపీ మిథున్‌రెడ్డి వీధి రౌడీలా ప్రవర్తిసూ... నామినేషన్ కేంద్రంలో టీడీపీ కార్యకర్తలపై దాడులకు దిగారన్నారు. వైసీపీ దౌర్జన్యాలపై తమ నాయకులు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. దాడులకు తెగబడిన వారిపై చర్యలకు చట్టపరంగా ముందకెళ్తామన్నారు. పోలీసులు పూర్తి స్వేచ్ఛతో విధులు నిర్వర్తిస్తున్నారన్నారని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**వైసీపీ చరిత్ర ముగిసింది**

గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు ఎలా వ్యవహరించారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని మంత్రి సవిత తెలిపారు. వారిలా తమ పార్టీ నాయకులు నామినేషన్లు చించలేదని, బెదిరింపులకు, దౌర్జన్యాలకు పాల్పడడం లేదని తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాలన్నది తమ అభిమతమన్నారు.

ఒకవైపు ఈడీ వరుస దాడులు, మరోవైపు వైఎస్ వివేకా హత్య కేసులో వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తుండటంతో ప్యాలెస్ పెద్దలు విలవిలలాడుతున్నారని మంత్రి సవిత తెలి పారు. దీంతో ఏం చేయాలో పాలుపోక, జగన్‌రెడ్డి రాష్ట్రంలో విధ్వంసాలకు తెరతీశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని చూస్తుంటే.జగన్ మాత్రం శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ పని ముగిసిందని, త్వరలో ఆ పార్టీ క్లోజ్ అవ్వబోతోందని మంత్రి సవిత తెలిపారు.

**'స్థానికం'లో క్లీన్ స్వీప్ చేస్తున్నాం...**

అయిదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు దోపిడీ, దౌర్జన్యాలతో కాలం గడిపారని, వారికి ఓటు అడిగే హక్కు కూడా లేదని మంత్రి సవిత అన్నారు. పులివెందుల సహా అన్నీ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి పార్టీలు క్లీన్ స్వీప్ చేయబోతున్నాయని ధీమా వ్యక్తంచేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, అభ్యర్థి ఎవరైనా విజయానికి కృషి చేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

# బయటి రాష్ట్రాల రౌడీలతో విధ్వంసానికి వైసీపీ కుట్ర

- తమిళనాడు, కర్నాటక, పంజాబ్ గూండాలకు ఏపీలో ఏం పని?
- కత్తులు, గన్నులతో పట్టుబడ్డ పంజాబ్ షూటర్లు
- వీరి వెనుక జగన్‌రెడ్డి, పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి
- పుంగనూరు అల్లర్ల దోషి మిథున్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలి
- స్థానిక ఎన్నికలు ముగిసేవరకు డిటైన్ చేయాలి
- రాయలసీమలో వైసీపీ దౌర్జన్యాలపై ఎస్ఈసీకి టీడీపీ నేతలు వర్ల రామయ్య, పర్చూరి అశోక్‌బాబు, ఎస్ రాజశేఖర్ ఫిర్యాదు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాయలసీమ వ్యాప్తంగా వైకాపా శ్రేణులు పాల్పడుతున్న హింసాత్మక ఘటనలు, దాడులపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం శనివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్. రాజశేఖర్, తదితరులు సీఈసీని కలిసి వినతిపత్రం అందజేశారు. దాడులకు పాల్పడిన వైకాపా నాయకులు, సహకరించిన అధికారులపై ఎన్నికల నియమావళి ప్రకారం తక్షణమే విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్ఈసీని కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వర్ల రామయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసి, వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పాల్పడుతున్న అరాచకాలు, బెదిరింపులపై సమగ్ర వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ఎన్నికల కమిషన్ మరింత చురుగ్గా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి చేసిన దౌర్జన్యాలు చూసి రాష్ట్ర ప్రజలంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. నిబంధనల ప్రకారం నామినేషన్ వేసేందుకు ముగ్గురు మాత్రమే వెళ్లాల్సి ఉండగా, తన కాన్వాయ్, ఆయుధాలతో గ్యాంగ్‌ను వెంటేసుకుని నామినేషన్ కేంద్రంలోకి చొరబడ్డారు. స్వయంగా రిటర్నింగ్ అధికారి పైనే చేయి చేసుకోబోవడం, వేలు చూపిస్తూ "తొక్క దించుతాం" అంటూ పచ్చి బూతులు, బెదిరింపులకు దిగడం టీవీల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. రిటర్నింగ్ ఆఫీసర్ సైతం అధికారికంగా ఫిర్యాదు చేసిన తర్వాత కూడా ఇంతవరకూ ఎన్నికల కమిషన్, పోలీసులు చర్యలు తీసుకోకపోవడం అత్యంత దురదృష్టకరం. దేశంలో చట్టాలు చేసే పార్లమెంట్ సభ్యుడిగా మిథున్ రెడ్డి చెప్పుకోవడానికి ఏమాత్రం అర్హత లేదు. ఆయనొక అవినీతిపరుడు, సంఘ విద్రోహ శక్తి. గతంలో విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులను, పోలీసులను ఎన్నోమార్లు విచక్షణారహితంగా కొట్టిన చరిత్ర ఆయనది. విమానాశ్రయంలో తనిఖీ చేయాలని అడిగిన పాపానికి ఒక సీనియర్ భద్రతాధికారి చెంపలు వాయించిన ఘనుడు. రూ.3,500 కోట్ల భారీ లిక్కర్ స్కామ్‌లో ప్రధాన ముద్దాయిగా అరెస్ట్ అయ్యి, రాజమండ్రి సెంట్రల్ జైలులో 71 రోజుల పాటు రిమాండ్ ఖైదీగా ఉన్న వ్యక్తి. ఆయన బయటకు ప్రజాప్రతినిధిగా కనిపిస్తున్నా.. లోపల మాత్రం రౌడీషీట్లు, హిస్టరీ షీట్లు, ఛార్జ్ షీట్లు, క్రిమినల్ కేసులతో నిండిపోయిన 'మేడిపండు' వ్యవహారమే. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు టీడీపీ నేతలను ఇళ్లకే పరిమితం చేస్తూ అక్రమంగా డిటైన్ చేసినట్లే, సమాజానికి ప్రమాదకరమైన మిథున్ రెడ్డిని ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు బయటకు రాకుండా వెంటనే హౌస్ అరెస్ట్ చేయాలి. ముఖ్యమంత్రికి కూడా లేని విధంగా ఐదు స్కార్పియో కార్లతో రౌడీషీటర్లు, ఆయుధాలతో ప్రైవేట్ సైన్యాన్ని వెంటేసుకుని తిరుగుతున్నారు. ఆకాన్వాయ్, ఎస్కార్ట్‌ను తక్షణమే రద్దు చేయాలి. రిటర్నింగ్ అధికారిని బెదిరించి, కార్యాలయంలోకి చొరబడినందుకు ప్రత్యక్ష ఆధారాలు ఉండగా, తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేసి ఆయనను అరెస్ట్ చేయాలి. మిథున్‌రెడ్డి ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, ఏం పన్నాగాలు పన్నుతున్నారనే దానిపై నిరంతరం ప్రత్యక్ష నిఘా పెట్టాలి. తుపాకులతో బెదిరించి కాల్పులు జరపడానికి పంజాబ్ నుంచి వచ్చిన పది మంది కిరాయి షూటర్లను అప్రమత్తంగా ఉన్న పోలీసులు పట్టుకున్నారు. వారిని రాష్ట్రానికి తీసుకువచ్చిన వైసీపీ నాయకుల కుట్రలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇటువంటి క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునే పూర్తి అధికారం, రాజ్యాంగ బద్ధమైన హక్కు ఎన్నికల కమిషన్‌కు ఉంది. ప్రజలు స్వేచ్ఛగా,ప్రశాంత వాతావరణంలో ఓటు వేయాలంటే వెంటనే మిథున్‌రెడ్డిపై కఠిన ఆంక్షలు విధించి చర్యలు చేపట్టాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

**పంజాబ్ షూటర్ల కుట్ర వెనుక జగన్, పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి**

రాష్ట్రంలోకి పంజాబ్ నుంచి వచ్చిన కిరాయి షూటర్ల వెనుక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు మిథున్‌రెడ్డిల హస్తం ఉందని ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో భయాందోళనలు, అరాచకం సృష్టించి ఎన్నికల్లో లబ్ది పొందేందుకే ఈభారీ కుట్రకు తెరలేపారని ఆయన ఆరోపించారు. పంజాబ్ నుంచి పది మంది ప్రొఫెషనల్ షూటర్లు అధునాతన ఆయుధాలతో రాష్ట్రంలోకి ఎందుకు వచ్చారు? వారి అసలు టార్గెట్ ఎవరు? ఎవరిని కాల్చి చంపడానికి వచ్చారని రాష్ట్ర ప్రజల తరపున సూటిగాప్రశ్నిస్తున్నాం. ఎన్నికల్లో పోటీ చేస్తే కనీసం ఒక్క సీటు కూడా గెలవలేమని, తమ అభ్యర్థులు డిపాజిట్లు కూడా దక్కించుకోలేరని తెలిపోవడంతోనే ప్రత్యర్థులను తుపాకులతో అంతమొందించాలని చూస్తున్నారు. పట్టుబడిన షూటర్ల వద్ద నిషేధిత బోర్ తుపాకులు మాత్రమే కాకుండా, కేవలం పోలీసులు, ప్రభుత్వం మాత్రమే ఉపయోగించే హై-ఎండ్ బ్యారెల్ గన్స్ కూడా లభ్యమయ్యాయి. అసలు ఈ స్థాయి మారణాయుధాలు వారికి ఎక్కడి నుంచి వచ్చాయి? ఎలా చేరాయి? అన్న అంశాలపై సమగ్ర దర్యాప్తు జరగాలి. ఇది సాధారణ నేరం కాదు, చట్టబద్ధంగా ఏర్పాటైన ప్రభుత్వంపై, ఎన్నికల ప్రక్రియపై, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై పన్నిన అతిపెద్ద కుట్ర. కేవలం షూటర్లను అరెస్ట్ చేయడంతో సరిపెట్టకుండా, దీని వెనుక ఉండి నడిపిస్తున్న అసలు సూత్రధారులు, కుట్రదారులు ఎవరు అనే విషయాన్ని పోలీసులు క్షుణ్ణంగా తేల్చాలి. ఈ ముఠా ఇంకా ఎంతమందిని తీసుకొచ్చింది, రాష్ట్రంలో ఇంకా ఎక్కడెక్కడ వీరి స్థావరాలు ఉన్నాయో వెలికితీయాలి. ఇందులో ఎంతటి పెద్ద నాయకులున్నా, ఏ స్థాయిలో ఉన్న వారైనా ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలి. ఈ మొత్తం పరిణామాల నేపథ్యంలో ఎంపీ మిథున్‌రెడ్డి కదలికలను పూర్తిగా నియంత్రించాలని, ఆయనపై నిరంతరం ప్రత్యక్ష నిఘా ఉంచాలని సీఈసీని కోరామని తెలిపారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు న్యాయసలహా తీసుకుని, చట్టబద్ధమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని వర్ల రామయ్య తెలిపారు. రాష్ట్ర ప్రజలు వాస్తవాలను గమనించాలి. ఒకవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే చంద్రబాబు నాయుడు, మరోవైపు కిరాయి ముఠాలు, తుపాకీ సంస్కృతిని ప్రోత్సహిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు. ఈ ఇద్దరినీ త్రాసులో పెట్టి బేరీజు వేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపైనే ఉంది. రాష్ట్రానికి, ప్రజల భవిష్యత్తుకు ఎవరు మేలు చేస్తారో విజ్ఞులైన ప్రజలంతా లోతుగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని వర్ల రామయ్య విజ్ఞప్తి చేశారు.

# 'స్థానికం'లో 100 శాతం స్ట్రైక్ రేట్ లక్ష్యం

- **అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రధాన అజెండా**
- **మంత్రి వాసంశెట్టి సుభాష్ ఉద్ఘాటన**



తరామచంద్రపురం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ఐక్యంగా ముందుకు సాగి, మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్టు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కూటమి ప్రభుత్వ పనితీరు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు కీలక అంశాలుగా ఉంటాయని పేర్కొన్నారు.

డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుత్తుల సాయి, గంధం పల్లంరాజు, నియోజకవర్గ పరిశీలకురాలు మజ్జి పద్మావతి శనివారం సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఎన్నికల వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, మూడు పార్టీల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. గత సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన అనుభవంతో, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకున్నామని తెలిపారు. కూటమిలో అక్కడక్కడా చిన్నచిన్న సమస్యలు ఉన్నప్పటికీ, వాటిని పరిష్కరించుకుంటూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కూటమి ఐక్యతే మా బలం.. సమన్వయంతో ఎన్నికలను ఎదుర్కొంటామన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు చేయి చేయి కలిపి పనిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. పరస్పర సమన్వయంతో ముందుకు సాగి, ఎన్నికల్లో తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

రామచంద్రపురం పట్టణంలో సుమారు రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.270 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, ఇతర ప్రజోపయోగ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వైసీపీ నేతలు ఇప్పటికీ తమ రాజకీయ వైఖరిని మార్చుకోలేదని మంత్రి సుభాష్ విమర్శించారు. అధికారంలోకి వస్తే ఏం అభివృద్ధి చేస్తామో చెప్పాల్సిన వైసీపీ నాయకులు, ప్రజలను భయపెట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన స్పష్టమైన ప్రణాళికలను ప్రతిపక్షం ప్రజల ముందుంచాలని పేర్కొన్నారు.

### మేడిశెట్టి శేషారావును గెలిపించండి

రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా మేడిశెట్టి శేషారావును కూటమి తరఫున ప్రకటించినట్లు మంత్రి సుభాష్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### అభివృద్ధి, సంక్షేమమే మా ప్రధాన అజెండా: ఎంపీ సానా సతీష్

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఉన్నత విద్యావంతుడు, ప్రముఖ వ్యాపారవేత్త మేడిశెట్టి శేషారావును ఎంపిక చేసినట్లు తెలిపారు. అలాగే మున్సిపాలిటీలోని 32 వార్డులకు సమర్థులైన అభ్యర్థులను బరిలో నిలిపామని స్పష్టం చేశారు. అన్ని వార్డుల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో, రాష్ట్రంలోనూ కూటమి అభ్యర్థులు విజయ కేతనం ఎగరవేస్తారని ఎంపీ సతీష్ ధీమా వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, మూడు పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, అభ్యర్థుల ఎంపికపై చర్చించడం ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశం సాగింది.

## కిరాయి ముఠాలతో విధ్వంసానికి వైసీపీ కుట్ర

- **మారణాయుధాలతో తిరుగుతున్న ఇతర రాష్ట్రాల గూండాలు**
- **బీహార్ సంస్కృతి తెచ్చిన జగన్‌రెడ్డి, పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి**
- **లోతైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి**
- **మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



రాయచోటి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి వైసీపీ నేతలు హింసను ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో అరాచక రాజకీయాలకు తెరలేపారని మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ అన్నమయ్య జిల్లా రాయచోటిలో అక్రమ ఆయుధాల కలకలం, రివాల్వర్లు, పిస్టళ్లు, బుల్లెట్లు, 10మందిని పోలీసులు అరెస్ట్‌చేయడంపై రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పందించారు. పుంగనూరు, రాయచోటిలో శుక్రవారం జరిగిన ఘర్షణలకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేల శ్రీకాంత్‌రెడ్డే ప్రధాన కారణమని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి కిరాయి గూండాలను రప్పించి స్థానికంగా దాడులు చేయిస్తున్నారని, బీహార్ సంస్కృతిని రాయలసీమలోకి తీసుకొచ్చి భయానక వాతావరణం సృష్టిస్తున్నారని విమర్శించారు.

పుంగనూరు, రాయచోటిలో పోలీసులు పట్టుకున్న కిరాయి హంతకుల నుంచి భారీ ఎత్తున మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. పోలీసుల దర్యాప్తులో అనేక భయానక వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ ముఠాలు ఎవరి కోసం ఇక్కడ రెక్కీ నిర్వహించాయి? గత మూడు రోజులుగా ఈ కిరాయి ముఠాలు చేసిన ఆపరేషన్ ఏమిటనే కోణంలో లోతైన విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ప్రజల మధ్య శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

స్థానిక ఎన్నికల్లో అల్లర్లు సృష్టించేందుకే ఢిల్లీ, హైదరాబాద్, పంజాబ్ నుంచి కిరాయి ముఠాలను గడికోట శ్రీకాంత్ రెడ్డి దింపారని ఆరోపించారు. ఎవరిని చంపడానికి రాయచోటిలో మారణాయుధాలతో తిరుగుతున్నారనేది ఆయన చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్ రెడ్డికి ఈ ముఠాలతో ఏమైనా సంబంధాలున్నాయనే విషయంపై పోలీసులు సమగ్ర విచారణ జరిపించాలని పట్టుబట్టారు. స్థానిక ఎన్నికల ప్రశాంతతను దెబ్బతీసేలా ఇతర రాష్ట్రాల ముఠాలను ఎందుకు దింపారని మంత్రి మండిపల్లి ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల వేల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమ ఆయుధాలు, కిరాయి ముఠాలతో ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు చేయాలని చూస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ ఘటన వెనుక ఉన్న అసలు వ్యక్తులు ఎవరో తేల్చి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు.

## నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి భద్రత

- **ఆటంకాలు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి**
- **అధికారులకు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఆదేశం**



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా, ప్రతి అభ్యర్థి స్వేచ్ఛగా, ప్రశాంతంగా తన నామినేషన్ దాఖలు చేసుకునేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు. నామినేషన్లు దాఖలు చేయకుండా తమను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు స్పందించారు.

రాయచోటి, పులివెందుల, తిరుపతి, దర్శి, రాజంపేట, దాచేపల్లి తదితర ప్రాంతాల్లో నామినేషన్ల దాఖలు కేంద్రాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు వచ్చిన ఫిర్యాదులపై పునేఠా స్పందించి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను తెలుసుకునేందుకు సంబంధిత జిల్లాల కలెక్టర్లతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ఈ సమీక్షలో ఎన్నికల కమిషన్ కార్యదర్శి, డా మల్లికార్జున, ఐజీ బి.రాజకుమారి కూడా పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ల దాఖలుకు ఆదివారం చివరి రోజు కావడంతో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను పునేఠా ఆదేశించారు. చివరి రోజున నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, నామినేషన్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బలగాలను అందుబాటులో ఉంచాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

నామినేషన్ దాఖలు చేయడానికి కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ తగిన భద్రత కల్పించాలని, అర్హులైన అభ్యర్థులు నిబంధనల ప్రకారం తమ నామినేషన్లను దాఖలు చేసుకునేందుకు అవసరమైన సహకారం అందించాలని కమిషనర్ స్పష్టం చేశారు. అభ్యర్థుల నామినేషన్ హక్కుకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో నిబంధనలు, ఎన్నికల నియమావళిని అభ్యర్థులు ఖచ్చితంగా ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎన్నికల ప్రక్రియలో ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించడం, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించడంఎన్నికల యంత్రాంగం బాధ్యత అని ఈ సందర్భంగా కమిషనర్ స్పష్టం చేశారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా ముగిసేలా అవసరమైన అన్నిచర్యలు చేపట్టాలని సంబంధిత జిల్లా అధికారులకు పునేఠా స్పష్టం చేశారు. అంతేకాకుండ హైకోర్టు ఆదేశాల మేరకు నామినేషన్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను తక్షణమే అమర్చే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. సమీక్షలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఐజీ రాజకుమారి.. సంబంధిత జిల్లాల ఎస్పీలతో మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు, పరిస్థితులకు అనుగుణంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే ప్రతి అభ్యర్థికి తగిన భద్రత కల్పించాలని, వారు ఎలాంటి అడ్డంకులు, భయాందోళనలకు గురికాకుండా నిబంధనల ప్రకారం తమ నామినేషన్లను దాఖలు చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియలో ఎవరైనా అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తే, అటువంటి పరిస్థితులను చట్ట ప్రకారం సమర్థవంతంగా ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా నామినేషన్ కేంద్రాల వద్ద నెలకొనే పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, ఉద్రిక్తతలు తలెత్తిన సందర్భాల్లో తక్షణమే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

చైతన్యరథం

# పులివెందులలో కదులుతున్న పునాదులు

- టీడీపీ అభ్యర్థుల నామినేషన్లను తట్టుకోలేని గొడ్డలిపార్టీ
- ఉక్రోషంతో బరితెగించిన ఎంపీ అవినాష్‌రెడ్డి
- ఎస్పీపైనే రాళ్ల దాడి, గాల్లోకి పోలీసుల కాల్పులు



పులివెందుల (చైతన్యరథం): దశాబ్దాలుగా స్థానికులను భయపెట్టి తమ కబ్జాలో ఉంచుకున్న పులివెందుల చేజారుతుందన్న భయంతో గొడ్డలి బ్రదర్స్ జగన్ రెడ్డి, అవినాష్ రెడ్డి బరితెగించారు. ప్రత్యర్థులు నామినేషన్ వేస్తేనే సహించలేక యుద్ధ వాతావరణం సృష్టించారు. కడప జిల్లా పులివెందుల లో తమ పునాదులు కదిలిపోతున్నాయనే ఉక్రోషంతో ఎంపీ అవినాష్ రెడ్డి ప్రోద్బలంతో వైసీపీ నేతలు నేతలు రెచ్చిపోయారు. విధుల్లో ఉన్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌పై రాళ్లదాడి చేశారు. అప్రమత్తమైన పోలీసులు ఆయనకు రక్షణగా నిలిచారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు.

నామినేషన్లు వేసేందుకు వైసీపీ అభ్యర్థులు కేంద్రా నికి చేరుకున్న సమయంలో అంతకు ముందుగానే అక్కడకు చేరుకుని వేచి ఉన్న టీడీపీ అభ్యర్థులను ముందుగా అనుమతిస్తామని పోలీసులు చెప్పడంతో ఘర్షణ చెలరేగింది. దీంతో ఇరువర్గాలు పరస్పరం రాళ్లతో దాడులు చేసుకున్నాయి. ఈ క్రమంలో వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా పోలీసుల పైకి దూసుకురావ డంతో.. వారిని అదుపు చేసేందుకు పోలీసులు గాల్లోకి 6 రౌండ్ల కాల్పులు జరిపారు. లాఠీచార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. టియర్ గ్యాస్‌ను ప్రయోగించి ఇరు పార్టీల శ్రేణులను నామినేషన్ కేంద్రం నుంచి దూరంగా పంపించి వేశారు. ఈక్రమంలో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నామినేషన్ కేంద్రం వద్ద ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ సందర్భంగా ఉదయం నుంచి చోటుచేసుకుంటున్న ఉద్రిక్త పరిస్థితులు గురించి తెలుసుకున్న ఎస్పీ విశ్వనాథ్ హుటాహుటిన పులివెందుల వెళ్లారు. ఆయన రాకను గమనించిన వైసీపీ కార్యకర్తలు రాళ్లదాడి చేశారు. తొలుత డీఎస్పీ మురళీనాయక్ పరిస్థితులను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఆరు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అయినప్పటికీ పరిస్థితులు సాధారణ స్థితికి రాకపోవడంతో నేరుగా ఎస్పీ రంగంలోకి దిగారు. మరో 10 రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. బాష్పవాయు గోళాలను కూడా ప్రయోగించారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని, వెళ్లకపోతే అరెస్ట్ చేస్తామని ఎస్పీ హెచ్చరించటంతో చివరికి వైసీపీ శ్రేణులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించిన అవినాష్ రెడ్డి తాను కూడా వెళ్లిపోయారు.

అనంతరం మీడియాతో ఎస్పీ విశ్వనాథ్ మాటాడుతూ అభ్యర్థితోపాటు మరో ఇద్దరు వచ్చి నామినేషన్ వేసుకోవచ్చని, కానీ, పులివెందులలో ఒకేసారి 500 మందికిపైగా వచ్చి నిబంధనలు ఉల్లంఘించారని చెప్పారు. అందరూ కలిసి నామినేషన్ కేంద్రానికి వెళ్తామని పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చారని తెలిపారు. పోలీసులపైనే రాళ్లదాడి చేశారు. పరిస్థితి చేయి దాటడంతో టియర్ గ్యాస్ ఉపయోగించాం. పరిస్థితిని అదుపుచేయడానికి గాల్లోకి కాల్పులు జరిపామని తెలిపారు.

## పునాదులు కదులుతున్నాయనే...

దశాబ్దాలుగా దౌర్జన్యాలతో ఏకగ్రీవం చేసుకుంటున్న ప్రాంతంలో టీడీపీ అభ్యర్థి నామినేషన్ వేస్తుంటే వైసీపీ నేతలు తట్టుకోలేక అల్లర్లకు దిగారు. శుక్రవారం వైసీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి జగన్ పిన్ని, వైఎస్ ప్రమీల మిగిలిన అభ్యర్థులతో కలిసి ప్రశాంతంగా నామినేషన్ వేశారు. వారి వెంట వచ్చిన అవినాష్ రెడ్డి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా, పోలీసులు కేవలం అభ్యర్థులను మాత్రమే లోనికి అనుమతించారు. అది మినహా వారి నామినేషన్ కార్యక్రమం ఎటువంటి ఆటంకం లేకుండా ముగిసింది. శనివారం టీడీపీ చైర్‌పర్సన్ అభ్యర్థి, ఇతర అభ్యర్థులు లోపల నామినేషన్ వేస్తుంటే, బయట తన మూకలతో మోహరించి అవినాష్ రెడ్డి గొడవ చేయడం మొదలుపెట్టాడు. పోలీసులు నచ్చజెప్పినా వినలేదు. పైగా రాళ్లు రువ్వుస్తూ రెచ్చగొట్టాడు. ఇటీవల జెడ్పీటీసీ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయినట్లే, పులివెందులలోనూ ఓడిపోతామనే భయం పట్టుకుంది. ప్రత్యర్థులు నామినేషన్ వేసి, గెలిచే పరిస్థితులు కనపడుతుంటే తట్టుకోలేక గొడ్డలి బ్రదర్స్ బరి తెగించారు. సిగ్గు, మానం, మర్యాద వదిలేసి భయంతో అల్లర్లు సృష్టించారు.

# మన్యానికి పోటెత్తిన పర్యాటకులు

**సందర్శనీయ ప్రాంతాలు కిటకిట**

**దసరా సెలవులు కావడంతో రద్దీ**

**ప్రకృతి అందాలను ఆస్వాదించిన సందర్శకులు**





పాడేరు(చైతన్యరథం): మన్యంలోని సందర్శనీయ ప్రదేశాలకు పర్యాటకుల తాకిడి కొనసాగుతోంది. ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో పర్యాటకులు మన్యానికి క్యూ కడుతున్నారు. సెలవు లకు కుటుంబ సమేతంగా పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తున్నా రు. దీంతో శనివారం ఏజెన్సీలో పర్యాటకుల సందడి నెలకొంది. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు సందర్శకుల హడావిడి కొనసాగు తుంది. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు, కటిక, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, డుంబ్రి గుడ మండలంలోని చాపరాయి జలవిహారీ, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడు గుల మండలంలో కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, చెరువులవేనం మేఘాలకొండ తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు.

## కిటకిటలాడిన జలవిహారీ

దసరా సెలవులు కావడంతో అరకు అందాలను తిలకించేందుకు శనివారం పర్యాటకులు పోటెత్తారు. స్థానిక చాపరా యి జలవిహారీ, అరకు పైనరీలు కిటకిట లాడాయి. చాపరాయి జలవిహారీలో నూతనంగా ఏర్పాటు చేసిన రైన్ డాన్స్‌లో చిన్నారులతో కుటుంబసభ్యులు ఎంజాయ్ చేశారు. తిరుగు ప్రయాణంలో అరకు పైనరీలో ఎత్తైన చెట్ల మధ్య సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ధింసా నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

## లంబసింగిలో సందడే సందడి

ఆంధ్రకశ్మీర్ లంబసింగిలో పర్యాటకులు సందడిచేశారు.వారంరోజులుగా శీతాకాల వాతావరణం ప్రారంభం కావడంతో లంబ సింగిలో ప్రకృతి అందాలు అమితంగా ఆకర్షిస్తున్నాయి.వీకెండ్, దసరా సెలవులు కలిసి రావడంతో శనివారం లంబసింగి ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు అత్యధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. ఉదయం ఐదు నుంచి పది గంటలవరకు చెరువులవేనం వ్యూ పాయింట్ పరిసరాల్లోసందర్శకులు ప్రకృతి సోయగాలను తిలకిస్తూ ఎంజాయ్ చేశారు. అందమైన దృశ్యాలను కెమెరాలో బంధించారు. తాజంగి జలా శయం వద్ద సాహస క్రీడలు జిప్‌లైన్, బోటింగ్ అందుబాటులో లేకపోవడంతో సందర్శకులు నిరాశ చెందారు. యర్రవరం జలపాతాన్ని సందర్శించారు. లంబసింగి పర్యాటకులతో రద్దీగా మారింది.

## అరకులోయలో సందడి

దసరా సెలవులు కావడంతో అందాల అరకులోయకు శనివా రం పెద్దఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. పర్యాటకుల రాకతో సందర్శిత ప్రాంతాలు గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్ట ఉడెన్‌బ్రిడ్జి, మాడగడ సన్‌రైజ్, అరకులోయలో ట్రైబల్ మ్యూజియం, పద్మాపురం గార్డెన్ సందర్శకులతో కిటకిటలాడాయి. ఆయా ప్రాంతాల్లో ఫొటోలు దిగుతూ పర్యాటకులు సందడి చేశారు. అదే విధంగా టూరిజం రిసార్ట్స్, ప్రైవేటు రిసార్టులు, లాడ్జీలు, హోటళ్లు రద్దీగా మారాయి. ఆటో, ట్యాక్సీలకు గిరాకీ ఏర్పడింది. చిరు వ్యాపారులకు తగిన వ్యాపారం జరిగింది.

# పురపోరుకు బీజేపీ అభ్యర్థుల ఖరారు

అమరావతి(చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రకటన విడుదల చేశారు. కూటమి నేతల మధ్య జరిగిన చర్చల అనంతరం బీజేపీ 2 కార్పొరేషన్లు, 7 మున్సిపాలిటీల్లో పోటీ చేస్తుంది. తాజాగా ఒక మేయర్, ఐదు చైర్మన్ స్థానాలకు అభ్యర్థులకు ప్రకటించింది. మున్సిపల్ కార్పొరేషన్‌లలో అనంతపు రం మేయర్ అభ్యర్థిగా కోట్ల అజేజ్‌బాబు, మున్సిపాలిటీలలో చైర్మన్ అభ్యర్థులుగా యలమంచిలి- పిల్ల రామాకుమారి, గూడూరుకు (ఎ)- దమమ్ సునీతాబాయి, నెల్లిమర్ల -మైపాడ ప్రసాద్, గిద్దలూరు – జాడి వెంకటనారాయణ, ఎర్రగుంట్ల – గోర్ల మధులతను ఎంపిక చేశారు. రాజమహేంద్రవరం మేయర్, బాపట్ల, కావలి మున్సిపాలి టీలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

### అంతర్జాతీయ అందాల పోటీల్లో

# ఏలూరు యువతికి కిరీటం

ఏలూరు(చైతన్యరథం): ఖండాలు దాటి తెలుగు కీర్తిని చాటిన ఏలూరు యువతి సాన్వి పాలెం అంతర్జాతీయ అందాల వేదికపై విజయకేతనం ఎగురవేసింది.

ఇటీవల అమెరికాలో జరిగిన రీజెన్సీ అంతర్జాతీయ అందాల పోటీలు – 2026లో జూనియర్ మిస్ యునైటెడ్ స్టేట్స్ రీజెన్సీ కిరీటాన్ని కైవసం చేసుకుంది. పోటీదారుల మధ్య తన ప్రతిభను చాటడంతో పాటు మరో రెండు పురస్కారాలను సొంతం చేసుకుంది. ఏలూరు రామచంద్రరా వుపేటకు చెందిన రూపాశేషాద్రి పాలెం కుమార్తె సాన్వి, అమెరికాలో ప్రతిష్ఠాత్మక రీజెన్సీ అంతర్జాతీయ అందాల పోటీలు – జూనియర్ టీన్ మిస్ యునైటెడ్ స్టేట్స్ రీజెన్సీ కిరీటాన్ని కైవసం చేసుకుంది.

టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో జరిగి ఈ పోటీల్లో 160 మంది పాల్గొనగా, సాన్వి జూనియర్ టీన్ విభాగంలో ద్వితీయ రన్నరప్‌తో పాటు పీపుల్స్ ఛాయిస్, ఇంటర్నేషనల్ అంబాసిడర్ -- 2026 పురస్కారాలను కూడా గెలుచుకుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో న్యూయార్క్‌లో జరిగే ఫ్యాషన్ వీక్‌లో ప్రముఖ డిజైనర్ మార్క్ దేఫాంగ్ రూపొందించే ఫ్యాషన్ ప్రదర్శనలో మోడల్‌గా సాన్వి అరంగ్రేటం చేయనుంది.

# రాయచోటిలో పంజాబ్ నరహంతక ముఠా!



- **10 మంది గన్ గ్యాంగ్‌ను రంగంలోకి దింపిన జగన్**
- **ప్రత్యర్థులను అంతమొందించే కుట్రలు, భీతిల్లుతున్న రాష్ట్ర ప్రజలు**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడని విష సంస్కృతిని గొడ్డలి పార్టీ ప్రవేశపెడుతోంది. ప్రత్యర్థులను ఎన్నికల్లో ఎదుర్కొని గెలవాల్సిందిపోయి.. ఏకంగా వారిని అంతమొందించేందుకు భారీస్థాయిలో కుట్రలకు పాల్పడుతోంది. అన్నమయ్య జిల్లాలో శుక్రవారం స్థానిక ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ఇతర రాష్ట్రాల కిరాయి ముఠాలను తీసుకొచ్చిన వైసీపీ నేతలు విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా రివాల్వర్లు, పిస్టళ్లు, బుల్లెట్లతో సహా 10 మందిని పోలీసులు చేశారు. పంజాబ్ నుంచి వచ్చిన 10 మంది కిరాయి హంతకులు పోలీసుల వలలో చిక్కారు. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేసిన పోలీసులు.. ఆ ముఠా దగ్గర దొరికిన అత్యంత ఆధునిక ఆయుధాలు చూసి నివ్వెరపోయారు.

అరెస్ట్ వెనుకడుగు వేయడానికి వీల్లేదు.. టార్గెట్ మిస్ కావడానికి అసలే వీల్లేదు..అనే ఏకైక లక్ష్యంతో ఆ ముఠాలను రంగంలోని దింపారు. ప్రజాస్వామ్యంగా జరగాల్సిన ఎన్నికల బరిలో.. రక్తపాతం సృష్టించేందుకు వేల మైళ్ల దూరం నుంచి ముఠాలను దింపారు. రాయచోటిలో వెలుగుచూసిన ఈ క్రిమినల్ ప్లాన్ చూస్తే.. జగన్ రెడ్డి అధికార దాహం కారణంగా రాష్ట్ర రాజకీయాలు ఎంత ప్రమాదకరమైన అండర్‌వరల్డ్ గేమ్‌గా మారుతున్నాయో అర్థమవుతుంది!

ఎన్నికల్లో ప్రత్యర్థుల పనిపట్టడానికి, ఏపీలో నెత్తుటేర్లు పారించడానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరఫున పంజాబ్ నుంచి దిగుమతైన ఆ కిరాయి గ్యాంగ్ ఎంట్రీ గ్యాంగ్‌స్టర్ సినిమాను తలపిస్తోంది. స్థానిక రాజకీయాల్లో 'గొడ్డలి' నీడన సాగే హింసాత్మక పంథాకు తోడు, ఇప్పుడు పంజాబ్ అండర్‌వరల్డ్ మనుషులను రప్పించడం అంటే.. రాజకీయాలను ఏ స్థాయికి దిగజార్చారో చెప్పడానికి ఇదే నిదర్శనం.

## ఇంకెన్ని గ్యాంగులు వచ్చాయో?

రాయచోటిలోనే కాకుండా రాష్ట్రంలో ఇంకెన్ని నియోజకవర్గాల్లో ఇలాంటి పంజాబ్ గ్యాంగ్‌లు అజ్ఞాతంలో తలదాచుకున్నాయనే విషయాన్ని పోలీసులు నిగ్గుతేల్చాలి. ఎన్నికల కోసం బాంబులు, గొడ్డళ్లు పోయి అత్యాధునిక తుపాకులు, పిస్టల్స్ వాడే గన్ గ్యాంగ్ సంస్కృతిని తెరపైకి తెచ్చిన ఈ నెత్తుటి కుట్ర వెనుక ఉన్న జ'గన్' రాష్ట్రాన్ని ఏమి చెయ్యాలని అనుకుంటున్నాడు? రాయలసీమలో వారి ఉనికిని చాటుకోవడానికి ఇంతటికి తెగించడం భయానకం. పోలీసులు ఈ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి వారి ప్లాన్‌ను భగ్నం చేసినా.. ఈ క్రిమినల్ ప్లాన్ వెనక ఇంకా ఎన్నో చీకటి కోణాలు బయటికి రావాల్సి ఉంది. ఈ హింసా రాజకీయాల మూలాలు కదిలి, వెనుక ఉన్న ముసుగు వీడే వరకు ఈ ఉత్కంఠ వీడదు.

### ఎన్నికల్లో గెలిచే దమ్ములేక...

## జగన్‌రెడ్డి రౌడీయిజం

- **బయటి రాష్ట్రాల రౌడీలతో వైసీపీ మూకల విధ్వంసం**
- **దాడులు చేసి టీడీపీపై నిందలా?**
- **ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజం**

అమరావతి (చైతన్యరథం): స్థానిక ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసే జగన్‌రెడ్డి పాన్ ఇండియా రౌడీయిజం చేస్తున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మండిపడ్డారు. దారుణాలకు తెగబడడం, ఆపై వాటిని ప్రత్యర్థుల మీదకు తోసేయడం గొడ్డలి పార్టీకి పుట్టుకతో అబ్బిన విద్య అని దుయ్యబట్టారు. రాత్రి నరకడం, ఉదయం పరామర్శలకు వెళ్లడం జగనాసుర చరిత్ర స్ట్రాటజీ అని విమర్శించారు.



గతంలో బాబాయి వివేకానందరెడ్డిని హత్య చేసి చంద్రబాబు చేతిలో కత్తి పెట్టి 'నారాసుర రక్తచరిత్ర' అంటూ ప్రజలను మభ్యపెట్టినట్లే, ఈ రోజుకీ అదే దుష్ట ఎత్తుగడని నీచపు రాజకీయాలకు అలవాటు పడిన జగన్‌రెడ్డి అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. స్థానిక ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదన తెలిసి మిళనాడు, కర్నాటక, పంజాబ్ రాష్ట్రాల నుంచి రౌడీలను తీసుకొచ్చి విధ్వంసాలకు తెగబడుతున్నారు. కార్లు వాళ్లే ధ్వంసం చేస్తారు, టీడీపీ కార్యకర్తలపై వాళ్లే దాడులు చేస్తారు, తిగిరి టీడీపీ కార్యకర్తలే దాడులు చేసినట్టు అసత్య ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధి పొందేలా జగన్‌రెడ్డి బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని కుట్రలు చేస్తున్నారు. పుంగనూరు కాలకేయుడు ఎంపీ మిథున్‌రెడ్డి కర్ణాటక, తమిళణాడు నుంచి రాడ్లు, కర్రలతో గూండాలను దింపితే, రాయచోటి రాక్షసుడు మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పంజాబ్ నుంచి ఏకంగా గన్నులు, పిస్తోళ్లతో రౌడీలను తెచ్చారు. ఇది పాన్ ఇండియా రౌడీయిజం కాక మరేమిటి? రక్తంతో తడిచిన చేతులు ఎవరివో, డ్రామాలు ఆడేది ఎవరో ప్రజలందరికీ తెలుసు. కూటమి పార్టీల కార్యకర్తలు, కేడర్ చేతులు ముడుచుకుని కూర్చోలేదు. చట్టపరంగా పోలీసులు ఇప్పటికే ఆ పంజాబ్ రౌడీలను అదుపులోకి తీసుకున్నారు. నాటి రాజారెడ్డి నుంచి నేటి జగన్‌రెడ్డి వరకు విధ్వంసాలు సృష్టించడమే వారి పద్ధతి. ఎన్నికల్లో బలం లేనప్పుడు భయపెట్టి గెలవాలనేది వైఎస్ కుటుంబ విధానం. ఇప్పుడు అదే విధానం కొనసాగిస్తామంటే ప్రజలు తిరగబడతారని శనివారం ఒక ప్రకటనలో బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు.

# ఇల్లు, షాపు కూల్చివేసిన వైసీపీ నేతలు

- **గ్యాస్ సిలిండర్ పేలుడులో తల్లి, దివ్యాంగ అక్క మృతి.. పరిహారం కోసం ఏడాదిగా తప్పని తిప్పలు**
- **టీడీపీకి అనుకూలంగా పని చేసినందుకు వైసీపీ హయాంలో అక్రమ కేసులు**
- **న్యాయం కోసం టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతులు**
- **అర్జీలు స్వీకరించిన గ్రీవెన్స్ మేనేజర్**



అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ సమస్యలపై తరలి వచ్చిన ప్రజలు అర్జీలు సమర్పించారు. కార్యాలయ గ్రీవెన్స్ మేనేజర్ వినతులు స్వీకరించారు.

కర్నూలు జిల్లా వెల్దుర్తి గ్రామానికి చెందిన నరసింహులు అభ్యర్థిస్తూ.. తమ గ్రామంలో గత 40 సంవత్సరాలుగా చిన్న సైకిల్ షాపు నడుపుకుంటూ గౌరవంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నానని తెలిపారు, 2014 నుంచి టిడిపి అభ్యర్థులకు మద్దతుగా నిలిచినందుకు వైసీపీ నేతలు తమపై కక్ష పెంచుకున్నారు. ఎన్నికల్లో కూడా తమ కుటుంబమంతా టిడిపికి ఓటు వేసిందనే కోపంతో అప్పటి పత్తికొండ వైసిపి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రోద్బలంతో నివాసముంటున్న తమ ఇంటిని (ఇంటి నెం. 13-173), సైకిల్ షాపును జేసీబీలతో కూల్చివేసి పూర్తిగా నేలమట్టం చేశారు. అధికార బలాన్ని అడ్డం పెట్టుకుని పోలీసుల ద్వారా నిత్యం భయభ్రాంతులకు గురిచేశారు. అక్రమ కేసులు బనాయించి స్టేషన్ల చుట్టూ తిప్పుతూ తీవ్రంగా కొట్టించి శారీరకంగా, ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతీశారు. తగు చర్యలు తీసుకోని తమకు నివసించడానికి ఇల్లు, జీవనాధారమైన సైకిల్ షాపును తిరిగి పునర్నిర్మారణం చేసి ఇప్పించాలని కోరారు.

కర్నూలు జిల్లా డోన్ మండలం అవులదొడ్డి గ్రామానికి చెందిన లక్ష్మిదేవి గ్రీవెన్స్ లో అర్జీ విజ్ఞప్తి చేస్తూ.. తన తల్లి మూగోళ్ల గోకారమ్మ, పుట్టుకతోనే మూగదైన అక్క మూగోళ్ల మాదేవి తనతో కలిసి ఉండేవారని తెలిపారు. గతేడాది జూన్ 14న ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంట్లో ఒక్కసారిగా గ్యాస్ లీకై సిలిండర్ పేలి పోవడంతో, మంటల్లో చిక్కుకుని తన తల్లి, దివ్యాంగురాలైన అక్క ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రమాదానికి సంబంధించి మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను అధికారులకు సమర్పించినప్పటికీ, ఇంతవరకు ప్రభుత్వం తరఫున గానీ, గ్యాస్ సరఫరా సంస్థ (కంపెనీ ఇన్సూరెన్స్) నుండి గానీ పైసా నష్టపరిహారం అందలేదు. నిరుపేద దళిత కుటుంబానికి చెందిన తమను అధికారులు పట్టించుకోవడం లేదు. తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం కడపరాజుపల్లెకు చెందిన పెమ్మసాని మల్లయ్య అర్జీ ఇచ్చి..తాను మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ అభిమానిని తెలిపారు. మా గ్రామంలో పార్టీ కార్యాక్రమాలకు సంబంధించి అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటాను. ఈ నేపథ్యంలోనే దోర్నాల పోలీస్‌స్టేషన్‌లో నా మీద, మా కుటుంబ సభ్యుల మీద అక్రమ కేసులు నమోదుచేశారు. వాస్తవ పరిస్థితులను, అందుబాటులో ఉన్న ఆధారాలను, సాక్షిల వివరాలను పూర్తిగా పరిశీలించకుండా మాపై అక్రమ కేసులు బానాయించారు. ఈ కేసులో వాస్తవ పరిస్థితులు పరిశీలించి కేసులు ఉపసంహరించాలని కోరారు.

తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామానికి చెందిన ప్రభాకర్, శివ, మళ్ల శ్రీను బాబు విజ్ఞప్తి చేస్తూ.. జీవనోపాధి కోసం చిన్న పరిశ్రమను నెలకొల్పే ఉద్దేశంతో దాదాపు 5 సంవత్సరాల క్రితమే పరిశ్రమల శాఖ ద్వారా ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నామన్నారు. దరఖాస్తు చేసుకున్న తరువాత గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలను నిర్లక్ష్యం చేస్తూ, రాయితీలు అందించకుండా తీవ్ర నిరాశకు గురిచేసింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నా తమకు ఎటువంటి న్యాయం జరగలేదు. కావున తమయందు దయవుంచి తమ అర్హతలను పరిశీలించి, ఎస్సీ కార్పొరేషన్, పరిశ్రమల శాఖ ద్వారా న్యాయం చేయాలని కోరారు. వీటితోపాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## టీడీపీలో చేరిన 80 కుటుంబాలు... ఆహ్వానించిన ఎమ్మెల్యే కిమిడి

విజయనగరం (చైతన్యరథం): స్థానిక ఎన్నికల వేళ టీడీపీలో భారీగా చేరికలు జరుగుతున్నాయి. మెరకముడిదాం మండలం గాదెల మర్రివలస మాజీ సర్పంచి నేరళ్ల నారాయణరావుతో పాటు 80 కుటుంబాలకు చెందిన వారు ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సమక్షంలో టీడీపీలో చేరారు. రాజాం టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీరు పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసి నాయుడు, ఏఎంసీ చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ కోట్ల మోతినాయుడు, పిన్నింటి సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : ఎమ్మెల్యే కూన



ఆమదాలవలస (చైతన్యరథం): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆమదాలవలస మండలం కొర్లకోట వద్ద ఉన్న కళ్యాణ మండపంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిగా సమాయత్తం కావాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీకి ఒక్క సీటు కూడా దక్కకూడదని, మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాలతో పాటు, జెడ్పీటీసీ స్థానాన్ని కూటమి కైవసం చేసుకునేలా కష్టపడి పనిచేయాలన్నారు. ఆమదాలవలస మండలంలోని 30 పంచాయతీల్లోనూ కూటమి మద్దతుదారులే సర్పంచులుగా విజయం సాధించేలా ప్రణాళికతో రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పేడాడ రామ్ మోహన్ రావు, బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి పేడాడ సూరపనాయుడు, టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, సనపల డిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతి, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఏపీ లోక్‌సత్తా మద్దతు




విజయనగరం: రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఏపీ లోక్ సత్తా మద్దతు ప్రకటించింది. శనివారం విజయనగరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబి కూటమికి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్థిరమైన రాజకీయాలతో పాటుగా అభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో 2024 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి లోక్‌సత్తా అధినేత డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ మద్దతు ప్రకటించారని గుర్తుచేశారు. మరోసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ మద్దతు ఇస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల ఎన్నికల్లో చైర్మన్, మేయర్ పదవులకి ప్రత్యక్ష ఎన్నికలు పెట్టడాన్ని అభినందిస్తున్నామన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిత్యం ప్రజ అభివృద్ధి కాంక్షించే జయప్రకాశ్ నారాయణ్ లాంటి గొప్ప వ్యక్తి కూటమి ప్రభుత్వానికి, అభ్యర్థులకు మద్దతు ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తెలుగుదేశం విజయనగరం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థి అవనాపు భార్గవి, నాయకులు విజయ్, అల్లంశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు... ఆహ్వానించిన హోంమంత్రి అనిత

నక్కపల్లి (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉద్దండపురంలో వైసీపీ నుంచి టీడీపీలోకి శనివారం హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో భారీగా చేరికలు జరిగాయి. మాజీ ఎంపీపీ బొల్లం సూర్యచలపతిరావుతో పాటు మరో 50 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల సంతృప్తి చెంది పార్టీలో చేరుతున్నారని అన్నారు. రానున్న రోజులలో నియోజవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. పార్టీలో వచ్చిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు.



## నీలకంఠాపురం పంచాయతీలో వైసీపీకి షాక్... టీడీపీలో చేరిన 90 కుటుంబాలు



కురుపాం (చైతన్యరథం): మన్యం జిల్లా, కురుపాం మండలం నీలకంఠాపురం పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాలకు చెందిన 90 వైసీపీ కుటుంబాలు శనివారం నాడు తెలుగుదేశం పార్టీలో చేరాయి. గుమ్మలక్ష్మీపురంలోని కురుపాం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. నాయుడు గూడ, కేదారిలంక, దొంబైమానుగూడ, మలగాడిగూడ, జాకరిగూడ గ్రామాలకు చెందిన వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరగా, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుతున్న తీరు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తమను ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీతో కలిసి పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కేవీ కొండయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ కోలా రంజిత్, సుకేష్ చంద్ర పండా, శంకర్, ప్రదీప్, దుర్గారావు పాల్గొన్నారు.

# టెక్కలిలో వైసీపీకి ఎదురుదెబ్బ..
# టీడీపీలోకి 200 కుటుంబాలు!

- **మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు**
- **స్థానిక సంస్థల ఎన్నికలకు సమష్టిగా సిద్ధం కావాలి.. ప్రజలకు మరింత చేరువ కావాలి: మంత్రి అచ్చెన్నాయుడు**



కోటబొమ్మాళి (చైతన్యరథం): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టెక్కలి నియోజకవర్గంలో రాజకీయ చేరికలు కొనసాగుతున్నాయి. టెక్కలి పట్టణంలోని గొల్లవీధికి చెందిన సుమారు 200 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. నాగళ్ళ శంకరరావు, నాగళ్ళ మోహినీ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వీరు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై పలు సూచనలు చేశారు.

### ప్రజల విశ్వాసమే మన బలం.. అభివృద్ధి, సంక్షేమమే మన లక్ష్యం

ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు నాయకులు, కార్యకర్తలకు సూచించారు. రాజకీయాల్లో ప్రజల ఆదరణ, విశ్వాసం ఎంతో ముఖ్యమని, ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం పనిచేయాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలోకి కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, స్థానిక సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని తెలిపారు.

### గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

టెక్కలి నియోజకవర్గంలో గ్రామాల వారీగా పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేయాలని మంత్రి సూచించారు. నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. పదవులు, హోదాలకంటే ప్రజాసేవకే ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలని అన్నారు. కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కొనసాగిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### స్థానిక సంస్థల ఎన్నికలకు సమష్టిగా సన్నద్ధం కావాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సమాయత్తం కావాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల కార్యాచరణ వంటి అంశాల్లో కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం కీలకమని పేర్కొన్నారు. ఏ భాగస్వామ్య పార్టీ తరఫున అభ్యర్థి పోటీలో ఉన్నా కూటమి ఐక్యతను కాపాడుకుంటూ సమష్టిగా పనిచేయాలని తెలిపారు. ప్రతిపక్షాల విమర్శలకు వాస్తవాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలితాల ద్వారా సమాధానం చెప్పాలని సూచించారు. విమర్శలకు ప్రతివిమర్శలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ, వారి అవసరాలకు అనుగుణంగా పనిచేసినప్పుడే ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకోగలమని పేర్కొన్నారు.

### గొల్లవీధికి చెందిన వైసీపీ నాయకుల చేరిక

టెక్కలి పట్టణంలోని గొల్లవీధికి చెందిన నాగళ్ళ శంకరరావు, నాగళ్ళ మోహినీ, కొనారి మల్లేసు, చందనగిరి వీరయ్య, తామి దేవేంద్రరావు, నెల్లిపర్తి రమ్ము, సాలిన చిన్నమ్మ, దాకూరి లక్ష్మీనారాయణమ్మ, ముడిమంచి బుద్దు, ముడిమంచి రఘు, కొనారి మహేష్, బర్ల లక్ష్మయ్య, ఎండ కిరణ్, రాపక అప్పన్న, నాగళ్ళ సింహాచలం, దాట్ల వెంకటేష్, పరపతి తపుదు, రాపక శంకర్, పిల్లల కిరణ్, తండా భాస్కరరావు, దాకూరి చిన్నబాబు, లావాటి రామారావు, గిన్ని నీలవేణి, నాగళ్ళ ప్రశాంతకుమార్, చల్లా వాసుదేవరావు, కొనారి గోవింద్, బందారు ప్రసాద్, కొనారి సంతోష్, ఎడుగురి శాంతి తదితరులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సానా సమక్షంలో రామచంద్రాపురం టీడీపీలోకి భారీ చేరికలు

**●టీడీపీలో చేరిన వైసీపీ మాజీ స్టేట్ లీగల్ సెల్ సభ్యులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాగాపు అమ్మిరాజు**



రామచంద్రాపురం (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ వర్గాల ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పేర్కొన్నారు. రామచంద్రాపురంలో మంత్రి వాసంశెట్టి సుభాశ్‌తో కలిసి ఆయన భారీ సంఖ్యలో ప్రజలను పార్టీలోకి ఆహ్వానించారు. ఎస్సీ, బీసీ వర్గాల నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ద్రాక్షారామం కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ సానా సతీష్‌బాబు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సానా మాట్లాడుతూ... రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుండటంతో గ్రామస్థాయిలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతమవుతోందని పేర్కొన్నారు. అమలాపురం నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**స్థానిక ఎన్నికల్లో సంపూర్ణ విజయమే లక్ష్యం**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులందరినీ గెలిపించుకోవడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సానా పిలుపునిచ్చారు. వంద శాతం విజయాలతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘనమైన బహుమతి అందించాలని కోరారు. వైకాపా కవ్వింపులు చర్యలను సహించమని హెచ్చరించారు. ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ అభ్యున్నతికి అంకితభావంతో పనిచేసే ప్రతి నాయకుడికి, కార్యకర్తకు తగిన గుర్తింపు, ప్రాధాన్యం లభిస్తాయని భరోసా ఇచ్చారు.

**కార్మికశాఖా మంత్రి వాసం శెట్టి సుభాష్ మాట్లాడుతూ...** నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని, కొత్తగా చేరిన వారందరినీ కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

## సమాజ శ్రేయస్సు కోసం మాజీమంత్రి యనమల శతచండీ యాగం



తుని (చైతన్యరథం): ప్రముఖ పుణ్యక్షేత్రం తొండంగి మండలం ఏవీ నగరంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శత చండీ యూత లక్ష్మీ యాగం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా జరిగింది. సకల జనుల దోషాలన్నీ తొలగి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు విజయలక్ష్మీ దంపతులు దేవీ నవరాత్రులను పురస్కరించుకుని శాతం చండీ యూత లక్ష్మీ యాగం తలపెట్టారు. నవరాత్రి పూజలతో ఏవీ నగరం ఆధ్యాత్మిక శోభతో పులకరించింది. శనివారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమించారు. అనంతరం వేదపండితులు మహిళలు, భవాని భక్తులతో కలిసి యనలమ రామకృష్ణుడు దంపతులు కుంకుమ పూజలు నిర్వహించారు. లక్ష్మీ యాగం 20వతేదీ వరకు కొనసాగనుందని ఆలయ నిర్వహకులు తెలిపారు.

## సర్పవరంలో వైసీపీకి షాక్.. టీడీపీలో చేరిన 45 మంది కీలక నేతలు

**● పుల్ల చందు ఆధ్వర్యంలో చేరికలు... ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీ**



కాకినాడ (చైతన్యరథం): కాకినాడ రూరల్ నియోజకవర్గం సర్పవరం గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీ కాకినాడ రూరల్ యువజన అధ్యక్షుడు పుల్ల చంద్రశేఖర్ (చందు) ఆధ్వర్యంలో సుమారు 45 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి అనంత లక్ష్మి, సత్యనారాయణ మూర్తి దంపతులు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పిల్లి దంపతులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్పవరం గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గతంలోనే వారు టీడీపీలో చేరేందుకు తమ సుముఖతను రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు తెలియజేశారని, అందులో భాగంగానే తాజాగా వారిని పార్టీలోకి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. టీడీపీలో చేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ.. గతంలో తాము టీడీపీలోనే కొనసాగామని, వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పరిస్థితుల కారణంగా పార్టీ మారాల్సి వచ్చిందని తెలిపారు. తిరిగి టీడీపీలో చేరడం ఆనందంగా ఉందని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు.

**పార్టీలో చేరిన ప్రముఖులు:**

టీడీపీలో చేరిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ జాయింట్ సెక్రటరీ పుల్ల ప్రభాకర్ రావు, సర్పవరం మాజీ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు (చిన్న), సర్పవరం భవన్నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పుల్లా నారాయణరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పుల్లా సురేంద్ర, గ్రామ కార్యదర్శి మానేపల్లి సుధీర్ తదితరులు ఉన్నారు.వారితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్ల ధర్మరాజు, మానేపల్లి సత్తిబాబు, సవరం చిట్టిబాబు, వార్డు సభ్యులు జోకా సత్తిబాబు, ఘంటసాల సతీష్, వానపల్లి వీరబాబు, పుల్ల చక్రధర్, జోకా గంగాధర్, వాసంశెట్టి పోతురాజు, తడిసెట్టి రాజేష్, తుమ్మలపల్లి చంటి, నామ సుబ్రహ్మణ్యం, శీలం అప్పారావు, ఘంటసాల బద్రి, పుల్ల రాము, వాసంశెట్టి రవి, పుల్ల నారాయణమూర్తి, మందపల్లి బాబురావు, మానేపల్లి శశికుమార్, పుల్ల స్వాములు తదితరులు టీడీపీలో చేరారు.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రధాన అజెండా

**●స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి సమరశంఖం**

**●100 శాతం స్ట్రైక్ రేట్ లక్ష్యంగా ముందుకు సాగుతాం : మంత్రి వాసంశెట్టి సుభాష్**



రామచంద్రపురం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఐక్యంగా ముందుకు సాగి, మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్టు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కూటమి ప్రభుత్వ పనితీరు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు కీలక అంశాలుగా ఉంటాయని పేర్కొన్నారు. రామచంద్రపురంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుత్తుల సాయి, గంధం పల్లంరాజు, నియోజకవర్గ పరిశీలకురాలు మజ్జి పద్మావతి సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, మూడు పార్టీల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు.

**ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ...** గత ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన అనుభవంతో, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకున్నామని తెలిపారు. కూటమిలో అక్కడక్కడా చిన్నచిన్న సమస్యలు ఉన్నప్పటికీ, వాటిని పరిష్కరించుకుంటూ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కూటమి ఐక్యతే మా బలం.. సమన్వయంతో ఎన్నికలకు సిద్ధమని, తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు చేయి చేయి కలిపి పనిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొంటామని మంత్రి తెలిపారు.

**మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా మేడిశెట్టి శేషారావును గెలిపించండి**

రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా మేడిశెట్టి శేషారావును కూటమి తరపున ప్రకటించినట్లు మంత్రి సుభాష్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**అభివృద్ధి, సంక్షేమమే మా ప్రధాన అజెండా : ఎంపీ సానా సతీష్**

రాజ్యసభ సభ్యులు సానా సతీష్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఉన్నత విద్యావంతుడు, ప్రముఖ వ్యాపారవేత్త మేడిశెట్టి శేషారావును ఎంపిక చేసినట్లు తెలిపారు. అలాగే మున్సిపాలిటీలోని 32 వార్డులకు సమర్థులైన అభ్యర్థులను బరిలో నిలిపామని స్పష్టం చేశారు. అన్ని వార్డుల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో, రాష్ట్రంలోనూ కూటమి అభ్యర్థులు విజయ కేతనం ఎగరవేస్తారని ఎంపీ సతీష్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, మూడు పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, అభ్యర్థుల ఎంపికపై చర్చించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశంగా సాగింది.

## దుర్గమ్మను దర్శించుకున్న నటుడు విజయ్ దేవరకొండ దంపతులు

**విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఆలయ చైర్మన్, ఈవో, అధికారుల స్వాగతం**



విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మవారిని ప్రముఖ సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులు దర్శించుకున్నారు. శనివారం ఇంద్రకీలాద్రికి విచ్చేసిన వారికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఆలయ చైర్మన్, ఈవో, ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. సినీ ప్రముఖులు ఒక్కసారిగా ఇంద్రకీలాద్రికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. తమ అభిమాన నటీనటులను చూసేందుకు భక్తులు, అభిమానులు ఆసక్తి చూపించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులు అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు సాగడంతో అక్కడ ఉత్సాహభరిత వాతావరణం కనిపించింది. శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకున్న సినీ ప్రముఖులను చూసేందుకు భక్తులు ఆసక్తి కనబరచడంతో ఇంద్రకీలాద్రిపై సందడి నెలకొంది.

## కూటమి అభ్యర్థుల విజయమే ధ్యేయం : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే ధ్యేయంగా సమష్టి కృషితో ముందుకు సాగాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. కొల్లూరు, భట్టిప్రోలు మండల కేంద్రాల్లో శనివారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై మండల స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ బలాన్ని, ప్రజలతో మనకున్న అనుబంధాన్ని చాటిచెప్పే కీలకమైన సందర్భమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు ఐకమత్యంతో పనిచేయాలన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలు, విభేదాలకు తావివ్వకుండా పార్టీ ప్రయోజనాలు, కూటమి విజయమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసే నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటారని తెలిపారు.

# పుంగనూరు ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**•ఎంపీ మిథున్ రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలి.. ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాలి**

**•విజయవాడలో కూటమి పార్టీల మధ్య పూర్తి సఖ్యత ఉంది : ఎమ్మెల్యే బొండాఉమా**



విజయవాడ (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పుంగనూరు ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. 2020 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలను గుర్తుచేస్తూ, పుంగనూరులో నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని బొండా ఉమా, నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల నిబంధనలను పాటించాల్సి ఉండగా, వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి వర్గానికి చెందినవారు నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యవహరించారని, రౌడీ మూకలు, ఆయుధాలు, మద్యం సీసాలు, కత్తులతో కూడిన కాన్వాయ్‌ను వినియోగించారని, ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు కూడా మీడియాలో ప్రసారమయ్యాయని తెలిపారు. పుంగనూరులో జరిగిన ఘటనపై ఎన్నికల సంఘం తక్షణమే స్పందించాలని బొండా ఉమా గారు డిమాండ్ చేశారు, ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ మిథున్ రెడ్డి సభ్యత్వం రద్దు చేయడంతో పాటు, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించే అంశాన్ని ఎన్నికల సంఘం పరిశీలించాలని అన్నారు, దాడులకు పాల్పడిన వారిపై వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు, వైసీపీ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని కూడా ఆయన కోరారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని బొండా ఉమా ఆరోపించారు. తిరుపతిలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి టీడీపీ అభ్యర్థి నుంచి నామినేషన్ పత్రాన్ని లాక్కున్నారని, పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి వర్గాల నుంచి ఎదురైన పరిస్థితులను టీడీపీ శ్రేణులు పుంగనూరులో ధైర్యంగా ఎదుర్కొన్నాయని, తమ పార్టీ శ్రేణులు దాడులకు పాల్పడలేదని ఆయన స్పష్టం చేశారు.

**విజయవాడలో ప్రశాంత వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలు**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కేంద్ర బలగాల అవసరం లేదని, రాష్ట్ర పోలీసు శాఖ సమర్థవంతంగా ఎన్నికలను నిర్వహించగలదని బొండా ఉమా అభిప్రాయపడ్డారు. విజయవాడలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై కూడా ఆయన మాట్లాడారు. పొత్తులో భాగంగా విజయవాడ మేయర్ స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించినట్లు వెల్లడించారు, కార్పొరేషన్ పరిధిలోని వార్డుల కేటాయింపుపై తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు సమావేశమై చర్చిస్తున్నారని, అదే రోజు తుది నిర్ణయం తీసుకుని సీట్ల కేటాయింపులను ప్రకటిస్తామని తెలిపారు. విజయవాడలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల మధ్య పూర్తి సమన్వయం, సఖ్యత ఉన్నాయని బొండా ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. కూటమి నాయకులు పరస్పర చర్చలతో ముందుకు సాగుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సమష్టిగా సిద్ధం కావాలి : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**• ప్రజా విశ్వాసమే మన బలం.. కూటమి విజయమే మన లక్ష్యం**



వేమూరు (చైతన్యరథం): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో, సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు గ్రామంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల కార్యాచరణ, గ్రామస్థాయిలో పార్టీ సంస్థాగత బలోపేతం, కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... ఎన్నికలు అనేవి కేవలం పదవుల కోసం జరిగే పోటీలు మాత్రమే కాదు.. ప్రజలకు సేవ చేసే అవకాశం, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ, పరిష్కార దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. గ్రామమే అభివృద్ధికి పునాది.. గ్రామస్థాయిలో బలమైన ప్రజా సంబంధాలే రాజకీయ విజయానికి పునాది అని పేర్కొంటూ, ప్రతి గ్రామంలో ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం, కార్యకర్తల అంకితభావం, సమన్వయంతో కూడిన కార్యాచరణ పార్టీ బలోపేతానికి దోహదపడతాయని తెలిపారు.

**ప్రజాసేవే ప్రధాన లక్ష్యం**

కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు పరస్పర గౌరవం, విశ్వాసంతో కలిసి పనిచేయాలని, ఉమ్మడి లక్ష్యాల సాధనకు సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత అభిప్రాయ భేదాల కంటే ప్రజా ప్రయోజనాలకు, పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ, ఎన్నికల సన్నద్ధతను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ప్రజల మధ్య ఉండాలి.. ప్రజల సమస్యలపై స్పందించాలి.. అభివృద్ధి కోసం నిరంతరం పనిచేయాలి. ఇదే ప్రజా జీవితంలో మన బాధ్యత, ఇదే పార్టీ శ్రేణుల పని విధానం కావాలి అని నక్కా ఆనంద బాబు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేస్తూ, ప్రజాసేవను ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# దుర్గమ్మ కృపతో ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలి : వై.వీ.బీ



ఉయ్యూరు (చైతన్యరథం): కనకదుర్గమ్మ వారి కృప ప్రజలందరిపై ఉండాలని కాంక్షిస్తూ టీడీపీ మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి రాజేంద్రప్రసాద్ కోరారు. శనివారం కానూరులో 100 అడుగుల రోడ్డు, అనుమోలు గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి రాజేంద్రప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... దుర్గమ్మ తల్లి అమ్మవారి కరుణ, కృపాకటాక్షాలతో ప్రజలు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని, ఎల్‌నినో ప్రభావం తగ్గిపోయి, విస్తారంగా వర్షాలు కురిసి, సమృద్ధిగా పంటలు పండాలని, అమ్మవారిని కోరుకున్నట్టు రాజేంద్రప్రసాద్ తెలిపారు.

# అత్యధిక మెజారిటీయే మా లక్ష్యం : గద్దె అనురాధ

**•19వ డివిజన్‌లో ముమ్మనేని ప్రసాద్ గెలుపు ఖాయం**



విజయవాడ (చైతన్యరథం): నగరపాలక సంస్థ ఎన్నికల్లో 19వ డివిజన్ కూటమి అభ్యర్థి ముమ్మనేని ప్రసాద్ గెలుపు ఖాయమని, భారీ మెజారిటీ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఉదయం 19వ డివిజన్‌లో కూటమి పార్టీల కార్పొరేటర్ అభ్యర్థి ముమ్మనేని ప్రసాద్ నామినేషన్ కార్యక్రమంలో గద్దె అనురాధ, గద్దె క్రాంతి కుమార్‌లు పాల్గొన్నారు. ఆర్టీసీ కాలనీలోని రామాలయం వద్ద నుంచి నామినేషన్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్న పాలనకు ప్రజల మద్దతు ఉందని, అదే ఆదరణ విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లోనూ ప్రతిఫలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. 19వ డివిజన్‌లో ముమ్మనేని ప్రసాద్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని గద్దె అనురాధ పిలుపునిచ్చారు. అదేవిధంగా నగరపాలక సంస్థలో కూటమి ఆధిక్యత సాధించేలా మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను కూడా భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

# వైసీపీకి గుడ్‌బై.. టీడీపీలోకి హిప్పి జానీ వర్గీయులు

**•ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ సమక్షంలో టీడీపీలో చేరిన హిప్పి జానీ వర్గీయులు**

**•మున్సిపల్ ఎన్నికల వేళ వినుకొండలో టీడీపీలో చేరికలు**



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ పట్టణంలో వైసీపీ నాయకుడు హిప్పి జానీ తన వర్గీయులతో కలిసి తెలుగుదేశంపార్టీలో చేరారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సమక్షంలో హిప్పి జానీతో పాటు ఎనిమిది మంది జానీ వర్గీయులకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు హిప్పి జానీ తెలిపారు. వినుకొండ పట్టణంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలన అనంతరం నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. వినుకొండ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని జానీ వర్గీయులు తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం పనిచేస్తామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన హిప్పి జానీ వర్గీయులను చీఫ్ విప్ జీవీ అభినందించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేయాలని కోరారు.

# టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన షేక్ ఆషా



విజయవాడ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందడి మొదలైంది. నూతనంగా ఏర్పడిన 50 డివిజన్‌కు స్థానిక టీడీపీ మైనారిటీ నాయకురాలు షేక్ ఆషా కూటమి బలపరిచిన అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతాఉల్లా, కార్పొరేటర్ అభ్యర్థి ఆషా నామినేషన్ ప్రక్రియలో పాల్గొని ఆమెకు అభినందనలు తెలిపారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా సమన్వయంతో పనిచేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ తెలిపారు.

## నందిగామ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా శాఖమూరు వంశీధర్ ఖరారు

నందిగామ (చైతన్యరథం): నందిగామ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా శాఖమూరు వంశీధర్ పేరును తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. గతంలో చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించబడిన డాక్టర్ కందుల అప్పారావు పేరు సాంకేతిక కారణాల వల్ల ఓటరు జాబితాలో నమోదు కాకపోవడంతో ఆయన స్వచ్ఛందంగా పోటీ నుంచి వైదొలగారు. ఈ నేపథ్యంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య... వంశీధర్ అభ్యర్థిత్వాన్ని బలపరచడంతో పార్టీ అధిష్ఠానం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వంశీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

# అట్టహాసంగా కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నామినేషన్

## కార్యక్రమంలో పాల్గొన్న మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి



మార్కాపురం (చైతన్యరథం): పట్టణంలో మార్కాపురం మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జున నామినేషన్ కార్యక్రమం పట్టణంలోని నాయుడు బజార్ నుండి మున్సిపల్ ఆఫీసు వరకు తెలుగుదేశం జనసేన, బీజేపీల క్యాడర్‌తో కలిసి మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కోలాహలంగా నామినేషన్ దాఖలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజవర్గ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు షేక్ వహీద్, మార్కాపురం నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్, మార్కాపురం జిల్లా బీజేపీ అధ్యక్షుడు పీవీ కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి అభ్యర్థి వక్కలగడ్డ మల్లికార్జున్, కూటమి మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇప్పటికే ఈ ప్రాంత అభివృద్ధి కోసం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశామని, వెలుగొండ ప్రాజెక్టు నీటి విడుదల చేశామని, ఇంటింటికీ పైప్ లైన్ పూర్తి చేసి త్వరలోనే నీటిని అందిస్తామని, 35 కోట్ల రూపాయలతో మార్కాపురం మున్సిపాలిటీలో సీసీ రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే మార్కాపురం మున్సిపాలిటీలో టిడ్కో ఇల్లు పంపిణీ చేయబోతున్నామన్నారు. ప్రతి నెల ఒకటో తేదీనే సామాజిక పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అన్నా క్యాంటీన్ ద్వారా ఐదు రూపాయలకే మార్కాపురం మున్సిపాలిటీలో అల్పాహారం భోజనం అందిస్తున్నామన్నారు. త్వరలోనే తమ శక్తి వంచన లేకుండా మార్కాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడుతామని కూటమి అభ్యర్థులను ప్రతి ఒక్కరిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నామినేషన్ కార్యక్రమం మార్కాపురం శాసనసభ్యుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. కూటమి అభ్యర్థులైన తెలుగుదేశం, జనసేన బీజేపీ పార్టీల కౌన్సిలర్ అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి మున్సిపల్ కార్యాలయంలో సమర్పించారు.



### జననీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరం

కనిగిరి (చైతన్యరథం): జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారిని శస్త్రచికిత్స నిమిత్తం సూచించారు. ప్రతి నెలా పేదల కోసం ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి జెండా ఎగరాలి

## టీడీపీ ఇన్చార్జి ఎరిక్సన్ బాబు పిలుపు

యర్రగొండపాలెం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలపై త్రిపురాంతకం మండల కూటమి నాయకులకు యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచారి ఎరిక్షన్ బాబు దిశానిర్దేశం చేశారు. త్రిపురాంతకం పట్టణంలోని ఆర్యవైశ్య సత్రంలో త్రిపురాంతకం మండల కూటమి నాయకుల సర్వసభ్య సమావేశంలో యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచిస్తూ, ఎన్నికల కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ, కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో త్రిపురాంతకం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల వల, మండల కూటమి నాయకులు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆత్మకూరు మునిసిపల్ ఎన్నికలు ప్రతిష్టాత్మకం

## మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి



ఆత్మకూరు (చైతన్యరథం): మున్సిపాలిటీ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేసే కూటమి పార్టీ అభ్యర్థులతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమావేశమయ్యారు. శనివారం ఆత్మకూరు పట్టణంలో టీడీపీ పార్టీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం కూటమి అభ్యర్థులతో సమావేశమై మున్సిపల్ ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని చెప్పారు. ఆత్మకూరు మున్సిపాలిటీకి కోట్లాది రూపాయల నిధులు కేటాయించామని అన్నారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి కంటే రెండేళ్లలో ఆత్మకూరులో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని కోరారు. ఆత్మకూరు అభివృద్ధిని వైసీపీ నాయకులు అడ్డుకున్నారని మంత్రి ఆరోపించారు. గతంలో వైసీపీ నేతలు ఆత్మకూరుకు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు వ్యక్తిగత స్వార్థంతో పాలనను అస్తవ్యస్తం చేశారని మండిపడ్డారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటినీ కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. ఆత్మకూరును అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యమని స్పష్టం చేశారు. అధిష్ఠానం నిర్ణయం మేరకు ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్ పర్సన్ అభ్యర్థిని ప్రకటిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు.



# దర్శిలో ఎన్నికల రణరంగం

దర్శి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రకాశం జిల్లా దర్శి మున్సిపాలిటీలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నామినేషన్లు దాఖలు చేసేందుకు అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ అభ్యర్థులు వారి మద్దతుదారులతో ఒకే సమయంలో మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దర్శి మున్సిపాలిటీ ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేసేందుకు శనివారం టీడీపీ, వైసీపీ అభ్యర్థులు సిద్ధమయ్యారు. దీంతో వారి మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో దర్శి మున్సిపల్ కార్యాలయం ప్రాంగణానికి చేరుకుని పోటాపోటీగా మోహరించారు. ఇరువర్గాలు మున్సిపల్ ఆఫీస్ ఎదుట భారీగా గుమిగూడటంతో ప్రత్యర్థి వర్గాల మధ్య తోపులాట, ఘర్షణలు చోటుచేసుకునే అవకాశం ఉందని భావించిన పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు.

పరిస్థితి చేయిదాటకుండా ఉండేందుకు పోలీసులు ఇరువర్గాల కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేసి అక్కడి నుంచి చెదరగొట్టారు. రాష్ట్రంలోని రాయచోటి, పుంగనూరు, ధర్మవరం వంటి ప్రాంతాల్లో నామినేషన్ల సందర్భంగా దాడులు, ఘర్షణలు జరిగిన నేపథ్యంలో దర్శి మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేవలం అభ్యర్థులను మాత్రమే లోపలికి అనుమతిస్తూ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నారు.



# చెదురుమదురు సంఘటనల మధ్య స్థానిక ఎన్నికల ప్రక్రియ




చిత్తూరు (చైతన్యరథం): ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా రెండో రోజు మున్సిపల్, కార్పోరేషన్ నామినేషన్ల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. పుంగనూరులో చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో రెండో రోజు నామినేషన్లు ఎలాంటి ఆందోళనలు లేకుండా ముగియడంతో పోలీసులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే పుంగనూరులో చివరి నిమిషంలో నామినేషన్ కేంద్రం వద్దకు భారీ ఎత్తున జనం చేరుకోవడంతో పోలీసులు కొంత ఆందోళనకు గురయ్యారు. చివరకు ఎలాంటి ఘర్షణలు జరగకపోవడంతో పోలీసులు కూడా హమ్మయ్య అనుకున్నారు. తొలిరోజు నామినేషన్ సందర్భంగా శుక్రవారం పుంగనూరులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొన్న విషయం తెలిసిందే. నామినేషన్లు వేసేందుకు వచ్చిన టీడీపీ నేతలపై వైసీపీ శ్రేణులు దాడులకు యత్నించడంతో పుంగనూరులో భయానక వాతావరణం నెలకొంది. ఇరుపార్టీలు పరస్పరం దాడులకు పాల్పడటంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టారు. అనంతరం నామినేషన్లు కొనసాగాయి. నిన్నటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. నామినేషన్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. దీంతో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రశాంతమైన వాతావరణంలో నామినేషన్లు దాఖలు చేశారు. మదనపల్లి నామినేషన్ కేంద్రం వద్ద సహృదయ వాతావరణం కనిపించింది. టీడీపీ చైర్మన్ అభ్యర్థి శ్రీరామ చిన్నబాబు, వైసీపీ చైర్మన్ అభ్యర్థి జింక వెంకట చలపతి చేతులు కలిపి ఒకే చోట నామినేషన్ దాఖలు చేశారు. స్నేహపూర్వక వాతావరణంలో ఎన్నికలను నిర్వహించుకుందాం అంటూ అభ్యర్థులు ఒకరినొకరు పలకరించుకున్నారు. షేక్ హ్యాండ్ ఇస్తూ కార్యకర్తలకు శాంతి సూచన పంపించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మదనపల్లెలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

# హిందూపురం మునిసిపాలిటీ మనదే

## ఎమ్మెల్యే బాలకృష్ణకు భరోసా ఇచ్చిన కూటమి శ్రేణులు



హిందూపురం (చైతన్యరథం): శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు కూటమి శ్రేణులు సర్వం సిద్ధం చేశాయి. ఇందులో భాగంగా టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పి.ఎస్. మంజునాథ్ ఘనంగా నామినేషన్ దాఖలు చేశారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, విజయం సాధించి తీరుతానని మంజునాథ్ ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సూచనల మేరకు మధ్యాహ్నం 2:15 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మంజునాథ్ ర్యాలీగా బయలుదేరారు. స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి చేరుకుని, ఎన్నికల అధికారులకు అధికారికంగా తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ హిందూపురం పట్టణాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, కూటమి అభ్యర్థిగా తనను గెలిపిస్తే పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ మరింత ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.



# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్

## ఎమ్మెల్యే నంద్యాల సమక్షంలో పలువురు టీడీపీలోచేరిక

ప్రొద్దుటూరు (మున్సిపాలిటీ పరిధిలోని 8 వార్డు వైసీపీ మాజీ కౌన్సిలర్ గాండ్ల నారాయణ స్వామి, వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నంద్యాల రాఘవరెడ్డి, యువనాయకులు నంద్యాల కొండారెడ్డి వెంట ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కొండవీటి భావన, టీడీపీ సీనియర్ నాయకులు మెట్టుపల్లె రామచంద్రా రెడ్డి, బచ్చల ప్రతాప్ ఈవీ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురంలో పోలీసుల జోక్యంతో పకడ్బందీగా ఎన్నికల నామినేషన్ ప్రక్రియ

అనంతపురం (చైతన్యరథం): నగరపాలక సంస్థ పరిధిలోని 62 డివిజన్లకు సంబంధించి నామినేషన్లు దాఖలు చేయడానికి ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర ఆశావహులు భారీగా తరలివస్తున్నారు. నామినేషన్ దాఖలుకు సమయం తక్కువగా ఉండటంతో కేంద్రాల వద్ద తీవ్ర రద్దీ నెలకొంది. పొరుగు ప్రాంతాలైన రాయచోటి, పుంగనూరు, తిరుపతి, ధర్మవరంలలో నామినేషన్ల వేళ దాడులు, ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో అనంతపురం జిల్లా పోలీసులు అత్యంత అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా కఠిన చర్యలు చేపట్టారు. నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గొడవలు జరగకుండా 144 సెక్షన్‌ను అమలులోకి తెచ్చారు. నామినేషన్ కేంద్రంలోనికి అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరికి (మరొకరికి మాత్రమే) మాత్రమే అనుమతినిస్తున్నారు. కేంద్రాల వద్ద భారీగా బలగాలను మోహరించి, ర్యాలీగా వస్తున్న శ్రేణులను బయటే అడ్డుకుంటూ.. కేవలం నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులను మాత్రమే లోపలికి పంపుతున్నారు. తొలి రోజు అనంతపురం పరిధిలో నెమ్మదిగా సాగిన ఈ ప్రక్రియలో కేవలం 16 నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. అయితే, నేడు దాదాపు అన్ని డివిజన్లకు సంబంధించి ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు.

# వైసీపీకి స్థానిక నేతల ఝలక్

## గౌరు చరితారెడ్డి సమక్షంలో టీడీపీలోకి 50 కుటుంబాలు

కర్నూలు (చైతన్యరథం): స్థానిక సంస్థల ముంగిట వైసీపీ ఝలక్ తగిలింది. కల్లూరు అర్బన 45వ వార్డు వైసీపీ చెందిన 50 కుటుంబాలు టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచ రితారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇనచార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం మాధవీనగర్ క్యాంపు కార్యాల యంలో శివప్పనగర్ వైసీపీ ముఖ్య నాయకుడు రామారావుతోపాటు 50 కుటుంబాలు టీడీపీలో చేరారు. టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన రెడ్డితో పాటు, గౌరు దంప తులు టీడీపీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చిన్న సుంకన్న, తాటికొండ మారెన్న, బదిగ మారెన్న, పెద్ద సుం కన్న, హనుమంత, ఎల్లప్ప, కడమంచి, ముగ్గ గోవిందు, శాంతరాజు, మహేష్, డొక్కా ఈరన్న, డొక్కా జమ్మయ్య, బదిగ పెద్దూరు, కొండ్ర ఎల్లప్ప, అంపయ్య, ఎల్లమ్మ, మారెమ్మ ఉన్నారు. కల్లూరు అర్బన 25 వార్డుకు చెందిన ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జీవీ చంద్రిక, బత్తుల నాగమల్లి, సర్వేశ్వరరావు, చింతలపల్లి లక్ష్మీకాంత, రాఘ వేంద్ర, తిరుపతయ్య, చల్లా వెంకటేశ, జానకీరాం, బండ రవి, వరప్రసాదరావు, శివశంకర్, రామకృష్ణ, మద్దిలేటిలు గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరా రు. కార్యక్రమంలో కల్లూరు కన్వీకర్ పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, రవిప్రకా ష్‌రెడ్డి, జంగాల సుంకన్న, రాములమ్మ, బుల్లెట్ సుంక న్న, ఎల్లన్న పాల్గొన్నారు.



# కడపలో వైసీపీ కసాయి రాజకీయం

## ఎక3్కడికక్కడ తిప్పి కొడుతున్న పోలీసు యంత్రాంగం

కడప (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో అల్లర్లకు తెగబడేందుకు వైసీపీ నేతలు కుట్రలకు పాల్పడుతున్నట్లు సమాచారం. రాయచోటిలో అంతర్రాష్ట్ర రౌడీ ముఠాను గొడ్డలి పార్టీ నేతలు దింపినట్లు తెలుస్తోంది. పంజాబ్ నుంచి మారణాయుధాలతో సహా నేరగాళ్లను జగన్ మోహన్ రెడ్డి పార్టీ నేతలు దింపినట్లు ప్రచారం జరుగుతోంది. వివిధ ప్రాంతాల్లో అలజడి సృష్టించేందుకు మారణాయుధాలతో క్రైమ్ ముఠాలు వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. రాయచోటిలోని నామినేషన్ కేంద్రం వద్ద గొడ్డలి పార్టీ గ్యాంగ్ హల్‌చల్ సృష్టించిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దఎత్తున హింసాకాండకు పాల్పడేలా ముఠాలను రంగంలోకి దింపినట్లు సమాచారం. లైసెన్సులేని తుపాకులు, అక్రమ ఆయుధాలతో ప్రజలను భయకంపితులను చేసేలా వైసీపీ నేతలు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే రాయచోటిలో రెండు తుపాకులు, బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ ఆయుధాలు కలిగి ఉన్న 10 మంది అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ఉమ్మడి కడప జిల్లాలో నామినేషన్ల పర్వంలో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. బరితెగించి గొడవలకు వైసీపీ శ్రేణులు దిగుతున్నట్లు సమాచారం. కడప నగరంలోని గాంధీనగర్ స్కూల్ నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య పరస్పరం రాళ్ల దాడులు జరిగాయి. టీడీపీ కార్యకర్తలపై కారంపొడి జల్లి రాళ్ల దాడులకు వందలాదిమంది వైసీపీ శ్రేణులు పాల్పడినట్లు తెలుస్తోంది. రాజంపేటలో కర్రలు రాళ్లతో నామినేషన్ కేంద్రానికి వైసీపీ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి వర్గీయులు వచ్చారు. ఈ క్రమంలో వీరిని టీడీపీ శ్రేణులు అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాగే, రాయచోటిలో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. కర్నూలు జిల్లాలోని వైసీపీ ఎమ్మిగనూరులో మున్సిపల్ చైర్మన్ పీఠం చిచ్చు రేపింది. వైసీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. రాజీవ్ రెడ్డి వర్సెస్ బుట్టా రేణుక వర్గంగా విడిపోయారు. వైసీపీ అధికారిక ఛైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ రఘు నామినేషన్ దాఖలు చేశారు. బుట్టా రేణుక వర్గం నుంచి మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పదవికి నజీర్ అహ్మద్ నామినేషన్ దాఖలు చేయడం గమనార్హం.చిత్తూరు కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. టీడీపీ నుంచి మేయర్ అభ్యర్థిగా కటారి హేమలత నామినేషన్ దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు చేశారు.మదనపల్లె మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద కాస్త ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ కేంద్రం వద్ద పెద్ద సంఖ్యలో గుమికూడేందుకు టీడీపీ, వైసీపీ నాయకులు వచ్చారు. వీరిని అక్కడినుంచి పోలీసులు దూరంగా పంపివేశారు.



# సమస్యాత్మక పీఎస్‌లపై నిఘా ఉంచాలి : ఎస్పీ విక్రాంత పాటిల్

కర్నూలు (చైతన్యరథం): స్థానిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ విక్రాంత పాటిల్ అన్నారు. మండలంలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలైన పోలకల్ రెగ్యులర్, స్పెషల్ పాఠశాలల కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని బ్రాహ్మణ దొడ్డి, బూరందొడ్డి, మారం దొడ్డి, కంబదహాల్, సి.బెళగల్, కొత్తకోట, కొండా పురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోడు మూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ వేణుగోపాల్‌రాజులకు ఆదేశించారు. గ్రామాల్లో ఎక్క డైనా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, ఫొటోలు కనిపిస్తే తొలగించాల న్నారు. మండలంలోని రౌడీషీటర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకు నేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత పాటిల్ ఆదేశించారు. గూడూరు పోలీస్ స్టేషన పరిధిలోని గూడూరు, జులకల్లు గ్రామంలో పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కోడుమూరు సీఐ తబ్రేజ్, గూడూరు ఎస్ఐ రాజా కుళ్ళాయప్ప, సి బెళగల్ ఎస్ఐ వేణుగోపాల రాజు ఉన్నారు.



# ఏపీలో పెట్టుబడులకు ఎన్ఆర్ఐలు ముందుకు రావాలి

## ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి శ్రీనివాస్ మిరియాల

**డబ్లిన్ (అమెరికా):** ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రవాసాంధ్రులు (ఎన్ఆర్ఐలు) ఉత్సాహంగా ముందుకు రావాలని ఉత్తర అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, జనసేన నేత శ్రీనివాస్ మిరియాల పిలుపునిచ్చారు. ప్రస్తుతం అమెరికాలోని వివిధ నగరాల్లో పర్యటిస్తున్న ఆయన బే ఏరియా జనసేన, ఏపీఎన్ఆర్టీ కమ్యూనిటీ సంయుక్తంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మిరియాల మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంకేతికత, నూతన సృజనాత్మకతలకు ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా స్టార్టప్ కంపెనీలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు ఏపీ ఒక స్వర్గధామంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న అనుకూలతలు, పెట్టుబడి అవకాశాల గురించి ఆయన వివరంగా ప్రసంగించారు. బే ఏరియా జనసేన నాయకుడు వీరబాబు ప్రత్తిపాటి ఆధ్వర్యంలో కాలిఫోర్నియాలోని డబ్లిన్ నగరంలో సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వర్కింగ్ డే అయినప్పటికీ ఎంతోమంది ఎన్ఆర్ఐలు, కూటమి పార్టీల నేతలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. ఏపీఎన్ఆర్టీ కో-ఆర్డినేటర్లు, కూటమి భాగస్వామ్య పక్షాలకు చెందిన ఎన్ఆర్ఐ ప్రతినిధులు రెడ్డయ్య ప్రత్తిపాటి, చిమటా శ్రీనివాస్, శివ మొలబంతి, అనిల్ అరిగె, శ్రీకాంత్ కంచన, దుర్గా పెద్దిరెడ్డి, వీర దాడి, సుబ్బు పప్పుల, రావు చెన్న, కిరణ్ విన్నకోట, శ్రీకాంత్ దొడ్డపనేని, శశి దొప్పలపూడి, మురళీ గూడవర్తి, వెంకట్ అడుసుమల్లి, సురేష్ పోతినేని తదితరులు పాల్గొన్నారు. ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.




# షార్లెట్‌లో వైభవంగా 'తెలుగు సంబరాలు'

**షార్లెట్/మిషిగన్:** అమెరికాలోని షార్లెట్‌లో "తెలుగు సంబరాలు-2026" అత్యంత వైభవంగా జరిగాయి. చిన్నారులు, యువత, పెద్దలు ప్రదర్శించిన శాస్త్రీయ సంగీతం, నృత్యాలు, ఫ్రీస్టైల్ డాన్సులు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 'సైన్స్ ఫెస్ట్'లో తొమ్మిది శాస్త్రీయ అంశాలపై ప్రయోగాలు, డెమాన్‌స్ట్రేషన్ ద్వారా చిన్నారులకు అవగాహన కల్పించారు. డ్రై ఐస్ ప్రయోగాలు, ప్లాస్మా బాల్ ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో తానా (TANA), జీటీఏ (GTA), ఆప్టా (APTA) తదితర తెలుగు సంస్థలు భాగస్వామ్యమయ్యాయి. నాట్స్ అధ్యక్షుడు రాజ్ అల్లాడ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 800 కొత్త రిజిస్ట్రేషన్లు నమోదైనట్టు నిర్వాహకులు వెల్లడించారు.

'నార్త్ అమెరికన్ తెలుగు సొసైటీ' (NATS) తన నూతన చాప్టర్‌ను మిషిగన్‌లోని ఫార్మింగ్టన్ హిల్స్‌లో ఘనంగా ప్రారంభించింది. కో-ఆర్డినేటర్‌గా శ్రీదేవి మణేపల్లి, జాయింట్ కో-ఆర్డినేటర్‌గా మహి బొల్లవరం నియమితులయ్యారు. రవి చాలంటి ఈవెంట్స్, లాజిస్టిక్స్ బాధ్యతలు, హేమ సూరపరాజు ట్రెజరర్‌గా, జ్యోతి జవ్వాది సభ్యత్వ బాధ్యతలు, అనుపమ దివాకర్ల పబ్లిక్ రిలేషన్స్, మీడియా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల సంస్థ హెల్ప్‌లైన్ సేవల గురించి, ఆపదలో ఉన్న తెలుగు వారికి అందిస్తున్న




సాయాన్ని వివరించారు. నాట్స్ ఎల్లప్పుడూ సమాజ సేవకే కట్టుబడి ఉంటుందని అధ్యక్షుడు రాజ్ అల్లాడ తెలిపారు. కార్యక్రమంలో మనోరమ గాంధీ, కూచిపూడి కళా ప్రోత్సాహకురాలు సంధ్యశ్రీ ఆత్మకూరి, 'మనబడి' తెలుగు భాషా కార్యక్రమ ప్రతినిధులు, సామాజిక సేవకుడు సన్నీ రెడ్డి, వైద్య-సినిమా రంగాల్లో సేవలు అందిస్తున్న డాక్టర్ హరినాథ్ పోలిచెర్లను ఘనంగా సత్కరించారు. స్థానిక విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ వేడుకలో ఆప్టా, డెట్రాయిట్ తెలుగు అసోసియేషన్, డెట్రాయిట్ తెలంగాణ కమ్యూనిటీ, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళల ఆరోగ్యం, సాధికారత, యువ నాయకత్వం, క్రీడలు, కుటుంబ కార్యక్రమాలు, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణే లక్ష్యంగా ప్రతి మూడు నెలలకు కనీసం ఒక ప్రధాన సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించాలని మిషిగన్ చాప్టర్ నిర్ణయించింది.



# అనీశ్వర్‌కు

## మరో అరుదైన పురస్కారం

### 'జూనియర్ జేన్ గూడాల్ ఎర్త్ మెడల్'కు ఎంపికైన ప్రవాస భారతీయ విద్యార్థి

**యూకే:** చిన్న వయసులోనే ప్రకృతి రక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం విశేష కృషి చేస్తున్న తెలుగు సంతతి విద్యార్థి అనీశ్వర్ కుంచాల ఖాతాలో మరొక అంతర్జాతీయ గౌరవం చేరింది. బ్రిటన్‌లో వన్యప్రాణుల సంరక్షణ కోసం పాటుపడే వారికి ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'జూనియర్ జేన్ గూడాల్ ఎర్త్ మెడల్'కు అనీశ్వర్ ఎంపికయ్యాడు. శాస్త్ర సాంకేతికత, సంగీతం, అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి అంతర్జాతీయ వేడుకలు నిర్వహించే 'స్టార్మస్' (STARMUS) సంస్థ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన ప్రవాస భారతీయుడు అనిల్ తనయుడే ఈ అనీశ్వర్. ప్రస్తుతం యూకేలో స్థిరపడిన ఈ బాలుడు చిన్ననాటి నుంచే ప్రకృతి, అంతరిక్షం, శాస్త్ర-సాంకేతిక రంగాలపై ఎనలేని ఆసక్తి ప్రదర్శిస్తున్నాడు. పర్యావరణహిత అంశాలను అధ్యయనం చేస్తూ సామాజిక చైతన్యాన్ని తెస్తున్న అనీశ్వర్ ఇప్పటికే 'గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్' సహా పలు అంతర్జాతీయ పురస్కారాలను సొంతం చేసుకున్నాడు. కెనడీ సెంటర్‌కు యూత్ అంబాసిడర్‌గా వ్యవహరించాడు.

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



సౌదీ అరేబియాలోని జెడ్డాలో...



అమెరికాలోని కాలిఫోర్నియాలో...



అబుదాబిలో...

**జెడ్డా (సౌదీ అరేబియా):** జెడ్డాలోని తెలుగు ప్రవాసీయులు మహిళల సామూహిక జీవన సౌందర్యాన్ని ప్రతిబింబించేలా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. అందరూ ఒక్కచోట చేరి సంప్రదాయ బద్ధంగా, ఆధ్యాత్మికంగా ఆనందాన్ని పంచుకున్నారు. ఆసిఫాబాద్‌కు చెందిన మీనాక్షి నుంచి కొత్తగూడేనికి చెందిన శ్రీలక్ష్మి వరకు అందరూ బతుకమ్మ చుట్టూ వలయాకారంలో తిరుగుతూ పాడిన పాటల్లో కుటుంబ బంధాలు, ప్రకృతి అందాలు, పల్లె జీవనం స్పష్టంగా కనిపించాయి. 'జెడ్డా తెలుగు మిత్రులు' అనే ప్రవాస తెలుగు సంఘం భారతీయ కాన్సులేట్ సౌజన్యంతో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించింది. ఈ వేడుక తెలుగు సంప్రదాయం కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా అందరినీ ఏకం చేసిందని జేటీఎం నాయకులు పడమట శివరామకృష్ణ, గాలి దుర్గాభవాని, కుంట సాగర్, శారదంబ బ్రహ్మానందం, గోలి శ్రీనివాస్, కోడూరి శ్రీనివాస్, కిశోర్ వికటకవి, జగన్ అక్కోరెడ్డి, హరికృష్ణ కొలిపాక, నారా హన్మంత్, వరుణ్ నకెరకంటి, స్వామినాథన్ సుధీర్ కుమార్, రామసీత గడిరాజు, భారతి గడిరాజు తెలిపారు. ప్రవాసాంధ్ర కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఉత్సవాల శోభను మరింత పెంచాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న భారతీయ కాన్సుల్ జనరల్ ఫహద్ ఖాన్ సూరి మాట్లాడుతూ... తెలుగు వారితో పాటు భారతీయులు ఎక్కడ ఉన్నా తమ మూలాలను, సంస్కృతిని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కష్టాల్లో ఉన్న తోటి భారతీయులను ఆదుకోవడానికి ప్రవాసాంధ్రులు ఎల్లప్పుడూ ముందుండాలని కోరారు. సద్దుల బతుకమ్మ విశిష్టతను వివరిస్తూ కృష్ణవేణి, స్వప్న, ప్రసన్న అతిథులకు వాయినాలు అందజేశారు. మీనాక్షి, సౌజన్య, సురేఖ, కవిత, మంజు, రమ్య బతుకమ్మ విశిష్టతను విశదీకరించారు.

**అబుదాబి:** తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ (టీఎఫ్ఏ) ఆధ్వర్యంలో అబుదాబిలోని ఇండియన్ సోషల్, కల్చరల్ సెంటర్ వేదికగా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ముఖ్య అతిథిగా కౌన్సిలర్ ఆఫ్ ఎంబసీ ఇండియా సౌమ్య గుప్తా, గౌరవ అతిథిగా కౌన్సిలర్ ఆఫ్ ఇండియా ఎంబసీ డాక్టర్ బాలాజీ రామస్వామి, ప్రత్యేక అతిథిగా బీజేపీ తెలంగాణ ఎన్ఆర్ఐ కన్వీనర్ దాస్యం అభినవ్, ఇండియన్ సోషల్-కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు బీజీ థామస్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్ఆర్ఐ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇండియా నుంచి వచ్చిన ప్రముఖ కళాకారుడు డాక్టర్ కోకిల నాగరాజు నృత్య దర్శకత్వంలో మహిళలు, యువతులు, చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. భారత్‌కు చెందిన గాయకులు, డాన్సర్లు అంజలి పులింటి, సోనీ యాదర్ల, సోనీ పటేల్ ఆటపాటలతో అలరించారు. అబుదాబిలో నివసించే కవీష్, సంజన, అభిరామ్ చక్కటి బతుకమ్మ పాటలు పాడారు. రాము గౌడ్ కుటుంబ సభ్యులు రూపొందించిన 12 అడుగుల బతుకమ్మ హైలైట్‌గా నిలిచింది. సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మలు తయారుచేసి తీసుకొచ్చిన మహిళలకు, సంప్రదాయ దుస్తులు ధరించిన చిన్నారులకు టీఎఫ్ఏ అధికార ప్రతినిధి రాజా శ్రీనివాసరావు, నిర్వాహకులు ప్రత్యేక బహుమతులు అందించారు. బతుకమ్మ వేడుకల కోసం శ్రమించిన టీఎఫ్ఏ మహిళా సభ్యులు పావని, అర్చన, పద్మజ, నిధి, వాహిని, ప్రణతిలను సౌమ్య గుప్తా ప్రత్యేకంగా అభినందించారు. యూఏఈ దేశ మహిళలు సైతం ఆడి పాడడం ఆకట్టుకుంది. టీఎఫ్ఏ ప్రతినిధులు శ్రీనివాస్, గంగారెడ్డి, వంశీ, అశోక్, జగదీశ్, గోపీనాథ్ తదితరులు వేడుకల నిర్వహణలో పాలుపంచుకున్నారు.

**కాలిఫోర్నియా:** అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం ఫ్రెస్నోలో ఉన్న శ్రీకృష్ణ బృందావన మందిరం (హిందూ టెంపుల్ ఆఫ్ ఫ్రెస్నో) ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, WETA ఫౌండర్-చైర్మన్ హన్మాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అమర్చి సంప్రదాయ పాటలు పాడుతూ సందడి చేశారు. ఇలాంటి వేడుకలు ఎన్ఆర్ఐల మధ్య ఐక్యత పెంపొంది స్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# పనులు పూర్తి చేయకపోతే
# మేమే ధర్నాకు కూర్చుంటాం

## - ఢిల్లీ హైకోర్టు వద్ద రహదారి భద్రతపై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని ఢిల్లీ హైకోర్టు సమీపంలో రహదారి భద్రతకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో జాప్యంపై సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధికారులు తగిన చర్యలుచేపట్టకపోతే హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద తామే స్వయంగా కూర్చొని ధర్నా చేస్తామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఢిల్లీ హైకోర్టు,జాతీయ జంతు ప్రదర్శనశాల సమీపంలోని మథుర రోడ్డు కూడలి వద్ద రహదారి భద్రత, సరైన ట్రాఫిక్ నిర్వహణ లేకపోవడం, పాదచారుల భద్రతా సమస్యలపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ జె.బి. పార్ధీవాలా, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఈ రోడ్డును ప్రతిరోజూ వేలాది మంది న్యాయవాదులు, కక్షిదారులు, పిల్లలు దాటుతుంటారు.

ఒక ఉన్నతస్థాయి కమిటీ ఈ సమస్యను పరిశీలిస్తోందని, తాను ఉన్నతాధికారులతో చర్చించానని కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) విక్రమ్‌జిత్ బెనర్జీ కోర్టుకు తెలిపారు. అయితే కమిటీ అవసరమేమిటని కోర్టు ప్రశ్నించింది. సమస్యను కచ్చితంగా గుర్తించి, పరిష్కారాన్ని కనుగొనేందుకు 'అమికస్ క్యూరీ' (కోర్టుకు సహాయం చేసే వ్యక్తి) గౌరవ్ అగర్వాల్‌ను కమిటీ సమావేశాల్లో భాగస్వామిని చేయాలని సూచించింది. అధికారులు కమిటీ చర్చలకే పరిమితం కాకుండా, తదుపరి విచారణకు ముందే అవసరమైన క్షేత్రస్థాయి పనులు పూర్తి చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

గడువులోగా స్పష్టమైన పరిష్కారాన్ని అమలు చేయడంలో విఫలమైతే ఏఎస్‌జీతో పాటు ఢిల్లీ ప్రధాన కార్యదర్శి కూడా కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని హెచ్చరించింది. నవంబర్ 25లోపు తగిన చర్యలు చేపట్టకపోతే తామే హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేస్తామని పేర్కొంది. "మీరు ఈ పని పూర్తి చేయకపోతే మేమిద్దరం ఢిల్లీ హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద కూర్చుంటాం. పని పూర్తయ్యే వరకు అక్కడి నుంచి కదలం, ఇంటికి కూడా వెళ్లం. మిమ్మల్ని కూడా ఇంటికి వెళ్లనివ్వం" అని ధర్మాసనం సరదాగా వ్యాఖ్యానించింది. ఈ కేసు నవంబర్ 25న మళ్లీ విచారణకు రానుంది.



### కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు
## అభిజీత్ దీప్కేకు షరతులతో బెయిల్

న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు దిల్లీలోని న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. మందిర్ మార్గ్‌లోని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం ఈ ఉత్తర్వులు ఇచ్చింది. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఏడాదిపాటు పీస్ బాండ్‌పై సంతకం చేయాలని ఆదేశించినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయన విడుదలయ్యారు. సీజేపీ శుక్రవారం కనాట్‌ప్లేస్‌లోని సెంట్రల్‌పార్క్‌లో సాయంత్రం 5గంటలకు 'లెహ్రా దో తిరంగా' పేరుతో ర్యాలీ తలపెట్టింది. దీనికి పోలీసులు అనుమతి నిరాకరించారు. అయినా సీజేపీ మద్దతుదారులు, పలు విద్యార్థి సంఘాల సభ్యులు జాతీయ పతాకాలతో అక్కడికి చేరుకున్నారు. ర్యాలీకి బయలుదేరిన దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలువురు విద్యార్థి కార్యకర్తలను నిర్బంధించి, పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అక్టోబర్ 10న ఇచ్చిన శాంతిహామీ పత్రాన్ని ఉల్లంఘించారని పేర్కొంటూ శనివారం ఉదయం దీప్కేతోపాటు మరికొందరిని అరెస్టు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా 'ఓట్ చోరీ', ఎస్ఐఆర్ అవకతవకలపై సీజేపీ నిరసన చేపట్టేందుకు సిద్ధమవుతున్న సమయంలో, ఆ రోజే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. మరుసటి రోజు ఏడాదిపాటు శాంతిభద్రతలకు భంగం కలిగించబోనని హామీ ఇచ్చి విడుదలయ్యారు. సీజేపీ ఈ అరెస్టును చట్టవిరుద్ధమని పేర్కొంది. "ఆయన కేవలం ప్రజలను జాతీయ పతాకం ఎగరేయమని కోరారు. అది నేరం ఎలా అవుతుంది?" అని పార్టీ న్యాయ విభాగ అధిపతి రత్న సింగ్ ప్రశ్నించారు.

### ఆరు నెలలలోపు శిశువుల ఆహారంలో
## సుక్రోజ్, ఫ్రక్టోజ్ నిషేధానికి ప్రతిపాదన



న్యూఢిల్లీ: ఆరు నెలల వరకు వయసున్న శిశువులకు ఉద్దేశించిన ఆహారఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్‌లను కలపడాన్ని నిషేధించాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతిపాదించింది. ఈ మేరకు 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్స్ ఫర్ ఇన్ఫాంట్ న్యూట్రిషన్) రెగ్యులేషన్స్, 2020'కు సవరణ ముసాయిదాను ప్రచురించింది. ఈ ముసాయిదా నోటిఫికేషన్ అక్టోబర్ 15న జారీ అయింది. అక్టోబర్ 16న అధికారిక గెజిట్‌లో ప్రచురితమైంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, కార్బోహైడ్రేట్ మూలంగా అవసరమైతే తప్ప శిశు ఆహారంలో సుక్రోజ్,ఫ్రక్టోజ్ కలపకూడదు. ఇప్పుడు ఆ మినహాయింపును ఆరు నెలలలోపు శిశువుల ఉత్పత్తులకు తొలగించాలని ప్రతిపాదించారు. పసితనంలోనే అదనపు చక్కెరలు తీసుకోవడాన్ని తగ్గించడంద్వారా శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, పోషకాహార భద్రతను బలోపేతం చేయడమే ఈ ప్రతిపాదనల లక్ష్యమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. "బిడ్డ ఎదుగుదలకు మొదటి ఆరు నెలలు ఎంతో కీలకం. ఈవయసు వారికి అవసరమైన పోషకాలు అందించేలా, సంబంధిత ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్‌లను కలపకుండా చూసేలా ఈ ప్రతిపాదనలను రూపొందించారు. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనే ప్రభుత్వ సిఫార్సులను ప్రోత్సహించేందుకూ ఈ చర్యలు తోడ్పడతాయి. బాల్యంలోనే ఊబకాయం, సంబంధిత ఆరోగ్య సవాళ్లను అరికట్టడం కూడా ఈ ప్రతిపాదనల ఉద్దేశం" అని ఆ శాఖ పేర్కొంది. ఈ ముసాయిదా ప్రతిపాదనలపై 60 రోజుల్లోపు అభ్యంతరాలను, సూచనలను సమర్పించవచ్చని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. గెజిట్ ప్రతులు ప్రజలకు అందుబాటులోకి వచ్చిన తేదీ నుంచి ఈ గడువు లెక్కిస్తారు.

### ఇంటర్నెట్ వినియోగం
# పిల్లల ప్రాథమిక హక్కు
## వయసు ఆధారిత ఆంక్షలను తోసిపుచ్చిన సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ: ఇంటర్నెట్‌ను వినియోగించుకునే హక్కు పెద్దలతోపాటు పిల్లలకూ ఉందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, ఆర్టికల్ 19(1)(ఎ) కింద ప్రాథమిక హక్కని పేర్కొంది.వయసు ఆధారంగా ఇంటర్నెట్ వినియోగంపై ఆంక్షలు విధించలేమని తేల్చి చెప్పింది. ఆన్‌లైన్‌లో చిన్నారులపై లైంగిక వేధింపుల కంటెంట్(సీఎస్ఈఏఎం)ను సోషల్‌మీడియా వేదికలు అధికారులకు నివేదించడంలేదని దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ జె.బి.పార్ధీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆ విధమైన పరిమితులవల్ల పిల్లలు ఇంటర్నెట్ యాక్సెస్ కోసం చట్టవిరుద్ధమైన మార్గాలు అనుసరించే ప్రమాదముందని ధర్మాసనం హెచ్చరించింది. దానివల్ల ఆన్‌లైన్‌లో ప్రలోభాలు, బెదిరింపులు ఎదురైనా, భయంతో ఆ విషయాలను తల్లిదండ్రులకు చెప్పడానికి వారు సంకోచించే అవకాశం ఉందని పేర్కొంది. పిల్లల భద్రత, ఇంటర్నెట్ వినియోగ స్వేచ్ఛ ఒకదానికొకటి విరుద్ధం కాదని, "మన పిల్లలకు ఈ రెండింటినీ పొందే హక్కు ఉంది" అని స్పష్టం చేసింది. ఇంటర్నెట్‌ను ఆలోచనల మార్కెట్‌గా, సృజనాత్మక వ్యక్తీకరణ, సమాచార మార్పిడి వేదికగా అభివర్ణించింది. దాన్ని పూర్తిగా నిరాకరించడం సమంజసం కాదని పేర్కొంది.

"చాలామంది పిల్లలకు, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోనివారికి ఇంటర్నెట్ ముఖ్యమైన సమాచార వనరు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలు ఇతరులతో కనెక్ట్ కావడానికి, ఇంటినుంచే అనేక విషయాలు నేర్చుకోవడానికి ఆన్‌లైన్ వేదికలు సహాయపడతాయి" అని ధర్మాసనం పేర్కొంది. సోషల్ మీడియా సంస్థలు హానికరమైన కంటెంట్‌ను గుర్తించి తొలగించకపోవడం వల్ల ప్రస్తుతం ఇంటర్నెట్ పిల్లలకు ప్రమాదకరంగా మారిందని వ్యాఖ్యానించింది. అయితే ఆ కారణంతో చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచడం పొరపాటని పేర్కొంది. చిన్నారుల ఖాతాల భద్రత కోసం యాప్‌లు ప్రత్యేకంగా'చైల్డ్ మోడ్'ను ప్రవేశపెడితే బాగుంటుందని సూచించింది. సోషల్ మీడియా యాప్‌లనుంచి బాలలపై లైంగిక వేధింపుల కంటెంట్‌ను తొలగించేందుకు కఠిన నిబంధనలు అమలుచేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.



## 2023 ముంబయి లియర్‌జెట్ ప్రమాదం:
### పైలట్ల తప్పిదమే కారణమన్న ఏఏఐబీ

ముంబయి: ఈ ఏడాది ప్రారంభంలో మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయిన బారామతి విమాన ప్రమాదానికి గురైన విమానం వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థకు చెందిన లియర్‌జెట్ 45. ఇదే మోడల్‌కు చెందిన మరో లియర్‌జెట్ 2023 సెప్టెంబర్ 14న ముంబయి విమానాశ్రయంలో కూలిపోయింది. ఈ ప్రమాదంపై విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) తాజాగా తుది నివేదిక విడుదల చేసింది. విశాఖపట్నం నుంచి వస్తున్న ఆ విమానం భారీ వర్షం, తక్కువ దృశ్యమానతలో ముంబయిలో ల్యాండ్ అవుతుండగా రన్‌వే నుంచి పక్కకు కూలి రెండు ముక్కలైంది. విమానంలోని ఎనిమిది మందినీ ఖాళీ చేయించి, గాయాలతో ఆస్పత్రికి తరలించారు. అస్థిర (అన్‌స్టెబిలైజ్డ్) ల్యాండింగ్ విధానాన్ని ప్రతికూల వాతావరణంలోనూ కొనసాగించాలన్న సిబ్బంది నిర్ణయం,విమానాన్ని సరిగా నియంత్రించలేకపోవడం ప్రమాదానికి ప్రధాన కారణాలని ఏఏఐబీ తేల్చింది. దీంతో తక్కువ ఎత్తులో విమానం ఏరోడైనమిక్ స్టాల్‌కు గురైందని పేర్కొంది. పైలట్లు ప్రామాణిక కార్యాచరణ విధానాలను పాటించలేదని స్పష్టం చేసింది. గాలి వేగాన్ని పర్యవేక్షించడంలో వైఫల్యం, గో-అరౌండ్ నిర్ణయంలో ఆలస్యం, ముంబయి విమానాశ్రయ నిర్ణీత ఆంక్షల సమయం ప్రారంభమయ్యేలోపు ల్యాండ్ చేయాలన్న ఒత్తిడి కూడా కారణమని తెలిపింది. ప్రతికూల వాతావరణంలో పరిస్థితులను ఎలా అంచనా వేయాలి, ఎలా ల్యాండ్ చేయాలన్న అంశాలపై సిబ్బందికి సరైన శిక్షణ లేదని వివరించింది. వీఎస్ఆర్ వెంచర్స్ చెక్‌లిస్ట్ నిబంధనలను పాటించాలని, విమాన లాగ్‌బుక్‌లను సరిగా నిర్వహించాలని సూచించింది. ల్యాండింగ్ దశలో స్టాల్ రికవరీపై పైలట్లకు పునశ్చరణ శిక్షణ అవసరాలను సమీక్షించాలని డీజీసీఏకు సిఫార్సు చేసింది. విమానాల మధ్య విభజన నిబంధనలను ఏఏఐ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు పాటించాలని కూడా పేర్కొంది.

# రష్యా ఆంక్షలపై ట్రంప్ మినహాయింపు

## భారత్, చైనాలకు భారీ ఊరట



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రష్యాతో ముడిపడిన ఆంక్షల నుంచి మినహాయింపునిస్తూ శుక్రవారం రాత్రి ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో భారత్, చైనాలకు భారీ ఊరట లభించింది. రష్యా నుంచి భారీగా ఇంధనం కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం టారిఫ్ విధిస్తానని ట్రంప్ గతంలో హెచ్చరించారు. ఇందుకోసం తీసుకొచ్చిన 'గ్రాహమ్ యాక్ట్' (గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్)ను సెప్టెంబర్ 16న అమెరికా కాంగ్రెస్ ఆమోదించింది. రెండు రోజుల తర్వాత ట్రంప్ దానిపై సంతకం చేసి చట్టంగా మార్చారు. ఈ చట్టం ప్రకారం రష్యా ఇంధనాన్ని ఎక్కువగా కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాలపై 100 శాతం టారిఫ్ విధించాలి. రష్యానుంచి దిగుమతులపై 500 శాతం టారిఫ్ కూడా ఉంది. అమలుకు 30 రోజుల గడువు సమీపించడంతో ట్రంప్ ఈ ఆంక్షలు, సుంకాల అమలుకు మినహాయింపునిచ్చారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని కాంగ్రెస్‌కు సమర్పించినట్లు తెలిపారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పెరిగిన ఇంధన ధరలను, ముఖ్యంగా డీజిల్ ధరలను తగ్గించేందుకు ఈ చర్య తీసుకున్నట్టు అమెరికా మీడియా నివేదించింది. మినహాయింపునకు గడువు ఏదీ నిర్ణయించలేదు. ఈ నిర్ణయంపై అమెరికా చట్టసభ సభ్యులనుంచి విమర్శలు వస్తున్నాయి. ఇరు పార్టీలకు చెందిన సెనేటర్లు ఆంక్షల అమలును డిమాండ్ చేస్తున్నారు.

# అణ్వాయుధ ప్రచారం.. పచ్చి అబద్ధం

## అమెరికా ఒత్తిడికి లొంగం: ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్



యెరెవాన్: తాము అణ్వాయుధాలను తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నామన్న ప్రచారం పచ్చి అబద్ధమని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అన్నారు. ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా, ఎన్ని బెదిరింపులకు పాల్పడినా అమెరికా ఒత్తిడికి తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అర్మేనియా రాజధాని యెరెవాన్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి జీవవైవిధ్య సదస్సు (కాప్17) సందర్భంగా శుక్రవారం జార్జియా ప్రధాని ఇరాక్లీ కొబాఖిడ్జేతో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరాన్ అణ్వాయుధాలపై తమ వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. అణ్వాయుధాల అభివృద్ధిని నిషేధిస్తూ ఇరాన్ దివంగత సుప్రీం లీడర్ అలీ ఖమేనీ గతంలోనే స్పష్టమైన వైఖరి తీసుకున్నారని గుర్తుచేశారు. ఇరాన్ ఎప్పుడూ చర్చలకు సిద్ధంగానే ఉందని చెప్పారు. అయితే, తమను బలవంతంగా లొంగదీసుకోవచ్చని అమెరికా భావిస్తోందని, అలాంటి చర్యలకు తాము అంగీకరించబోమని పెజెష్కియాన్ తేల్చిచెప్పారు. అమెరికా విధిస్తున్న ఆంక్షలు మానవతా సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. ఇరాన్‌పై ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడులను అన్యాయమైన, అమానవీయ చర్యలుగా అభివర్ణించారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని తాము వ్యతిరేకిస్తామని కొబాఖిడ్జే ఈ సందర్భంగా చెప్పారు. అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తో జరిగిన మరో సమావేశంలోనూ పెజెష్కియాన్ అమెరికాపై విమర్శలు గుప్పించారు. ఇరాన్ లొంగిపోదనే వాస్తవాన్ని అమెరికా గుర్తించాలని అన్నారు. ఇరాన్ తన ప్రజలపై ఆధారపడుతూ, పొరుగు దేశాలతో సమన్వయం చేసుకుంటూ ప్రపంచంతో సంబంధాలు కొనసాగిస్తుందని పేర్కొన్నారు. అమెరికా ఆంక్షలు ఇరాన్‌తోపాటు ప్రపంచ దేశాలకూ సమస్యలు సృష్టిస్తున్నాయన్నారు. వాషింగ్టన్ ఇదే విధానాన్ని కొనసాగిస్తే ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు మరింత దిగజారతాయని హెచ్చరించారు. బలప్రయోగానికి బదులుగా తర్కబద్ధమైన చర్చలకు ముందుకు రావాలని అమెరికాకు పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగుస్తుందని, ఆ దేశం అణ్వాయుధాలను పొందడానికి అనుమతించబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పునరుద్ఘాటించారు.

# యువత గొంతు అణిచేస్తున్నారు..!

## భారత యువత నిరసనలపై ఐరాస ప్రత్యేక ప్రతినిధి ఆరోపణలు: కొట్టిపడేసిన భారత్




న్యూయార్క్: భారత్‌లో యువత చేపట్టిన ఆందోళనల గురించి ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి జినా రొమెరో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మానసిక ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి మాట్లాడుతున్నందుకు యువత ప్రభుత్వం నుంచి వివక్ష, అణచివేతలను ఎదుర్కొంటోందని ఆరోపించారు. హక్కుల కోసం పోరాడటానికి వారికి తగిన స్వేచ్ఛ లేదంటూ ఐరాస సర్వసభ్య సమావేశంలో నివేదికలను ప్రస్తావించారు. అక్టోబర్ 10న ఎక్స్ పోస్టుల్లో శాంతియుత యువ నిరసనకారులపై అధిక బలప్రయోగం, ఏకపక్ష నిర్బంధాలు జరిగాయని కూడా ఆరోపించారు. ఈ ఆరోపణలను ఐరాసలోని భారత దౌత్యవేత్త అనుజ్ స్వరూప్ కొట్టిపడేశారు. రొమెరో వ్యాఖ్యల్లో నిజం లేదని స్పష్టం చేశారు. పేర్లు వెల్లడించని, అధికారిక ధ్రువీకరణ లేని కొన్ని కథనాలను ఆధారంగా తీసుకుని ఆమె ఈ ఆరోపణలు చేశారన్నారు. ఐరాస 81వ సర్వసభ్య సమావేశంలోని థర్డ్ కమిటీలో ఆయన భారత్ తరఫున మాట్లాడారు. "ఐరాస ప్రత్యేక ప్రతినిధి ఇచ్చిన నివేదికలను భారత్ గమనించింది. భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి శాంతియుత సమావేశ స్వేచ్ఛ, సంఘ స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పిస్తుంది. స్వతంత్ర న్యాయవ్యవస్థ, స్వేచ్ఛాయుత పత్రికారంగం, జాతీయ మానవ హక్కుల కమిషన్ వంటివి పౌరుల హక్కులకు రక్షణ కల్పిస్తున్నాయి. కేవలం పేరు లేని కొన్ని నివేదికలను ఆధారంగా చేసుకుని, ఓ దేశంలోని యువత వివక్షను ఎదుర్కొంటున్నారని వాదించడం సరైన చర్య కాదు. ఇటువంటి అత్యున్నతస్థాయి సమావేశాల్లో తప్పుడు వార్తలు ప్రచారం చేసి, ఐక్యరాజ్యసమితి, దాని సంస్థల విశ్వసనీయతను కోల్పోతున్నారు" అని స్వరూప్ అన్నారు. విచిత్రమేమిటంటే, భారత్‌లోని యువత ఓ వ్యంగ్య రాజకీయ ఉద్యమాన్ని (యూత్ ప్రొటెస్ట్) సృష్టించిందని అదే నివేదికలో పేర్కొన్నారు. వారు చెప్పినట్లు దేశంలో ప్రభుత్వ అణచివేత ఉంటే నాయకులను ఎలా ప్రశ్నించగలుగుతున్నారు? దేశ రాజధానిపైకి ఎలా దూసుకెళ్లగలుగుతారు? భారత్‌లో యువ ఉద్యమాలు జరిగినప్పుడు నేతలకు, వారికి మధ్య చర్చలు ప్రభావవంతంగా జరుగుతాయని ఇటీవల ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ టర్క్ వ్యాఖ్యానించారు. బహుశా ఆ సమాచారం ప్రత్యేక ప్రతినిధి దృష్టికి రాలేదేమోనని స్వరూప్ చురకలు అంటించారు.

ప్రభుత్వ పరీక్షల్లో అవకతవకలపై ఇటీవల విద్యార్థులు చేపట్టిన నిరసనల విషయంలో ప్రభుత్వం స్పందించిన తీరును భారత దౌత్యవేత్త ప్రస్తావించారు. యువతో సంప్రదింపులు జరిపి, పరీక్షల్లో మోసాలను అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. భారత అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.



# కాక్స్ బజార్‌లో ఘోరం

## వెదురు రిసార్ట్ దగ్ధం, 10 మంది మృతి

ఢాకా: బంగ్లాదేశ్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.కాక్స్‌బజార్ జిల్లాలోని సముద్రతీర రిసార్ట్‌లో శనివారం ఉదయం చెలరేగిన మంటల్లో 10మంది మరణించారు. మరో 9మంది గాయపడ్డారు. కొందరు మంటల్లో చిక్కుకుపోగా, వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఇనాని ప్రాంతంలోని మెరైన్ డ్రైవ్ పరిధిలో, పత్వార్టెక్ బీచ్ సమీపంలో ఉన్న'టుపుటుప్ రెస్టో అండ్ రిసార్ట్'లో ఉదయం 6.30గంటలకు ఘటన చోటుచేసుకుంది. మూడంతస్తుల భవనాన్ని పూర్తిగా వెదురు, కలపతో నిర్మించారు. దీంతో మంటలు వేగంగా వ్యాపించాయి. పై అంతస్తుల్లో ఉన్నవారు కిందికి రాలేక లోపలే చిక్కుకుపోయారు. ప్రమాద సమయంలో సుమారు 30మంది ఉన్నట్లు అంచనా. వారిలో నలుగురైదుగురు మాత్రమే బయటపడగలిగారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది,పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.మంటలుత్వరగా అదుపులోకి రాకపోవడంతో భారీనష్టం సంభవించింది. రిసార్ట్ మొత్తం కాలి బూడిదైందని కాక్స్ బజార్ ఫైర్ సర్వీస్ డిప్యూటీ అసిస్టెంట్ డైరెక్టర్ సయ్యద్ మహమ్మద్ మోర్షెద్ హొస్సేన్ తెలిపారు. అధికారులు 10 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన 9 మందిని కాక్స్ బజార్ సదర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. విచారణ జరుగుతోంది. వంటగదిలో మంటలు చెలరేగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. వెదురు, కలపతో నిర్మించిన కట్టడాల భద్రతపై ఈ ఘటన ప్రశ్నలు రేకెత్తిస్తోంది.?

# అమెరికాలోకి పెట్టుబడుల వెల్లువ

## భారత్ వాటా 330 బిలియన్ డాలర్లుగా వైట్ హౌస్ వెల్లడి

వాషింగ్టన్: ప్రపంచ దేశాల నుంచి అమెరికాలోకి వచ్చిన పెట్టుబడుల లెక్కలను వైట్ హౌస్ తాజాగా వెల్లడించింది. తమ దేశంలోకి ట్రిలియన్ల కొద్దీ పెట్టుబడులు ప్రవహించాయని, వాటిలో భారత్ నుంచే 330 బిలియన్ డాలర్లు (330.5 బిలియన్ డాలర్లు) వచ్చాయని పేర్కొంది. అమెరికాలోని ప్రైవేటు పరిశ్రమలు, విదేశాల నుంచి వచ్చిన పెట్టుబడుల మొత్తం 10.87 ట్రిలియన్ డాలర్లని తెలిపింది. వైట్ హౌస్ తన యూట్యూబ్ ఛానల్‌లో ఈ గణాంకాల జాబితాను పదే పదే ప్రసారం చేసింది. భారత్ పేరిట జాబితాలో రెండు పద్దులున్నాయి. ఒకటి 310 బిలియన్ డాలర్లు, మరొకటి 20.5 బిలియన్ డాలర్లు. "అమెరికాలోకి ట్రిలియన్ల కొద్దీ డబ్బు వచ్చి చేరుతున్న శబ్దాన్ని హాయిగా కూర్చొని ఆస్వాదించండి" అని దేశ ప్రజలనుద్దేశించి ఎక్స్ పోస్టులో రాసుకొచ్చింది. టెక్సాస్ రాష్ట్రంలోని బ్రౌన్స్‌విల్ ఓడరేవు ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న కొత్త రిఫైనరీ ప్రాజెక్టులో భారతీయ సంస్థ రిలయన్స్ భాగస్వామిగా ఉంది. ఈ ప్రాజెక్టు విలువ 300 బిలియన్ డాలర్లని ట్రంప్ ఈ ఏడాది మార్చిలో ప్రకటించారు. అలాగే, భారత దిగ్గజ సంస్థ ఎస్సార్ గ్రూప్, తన అనుబంధ సంస్థ మెసాబి మెటాలిక్స్ ద్వారా అయోవా రాష్ట్రంలో ఉక్కు కర్మాగారం నిర్మించనుంది. ఇందుకోసం 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. మే నెలలో జరిగిన సెలక్ట్ యూఎస్ఏ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు సందర్భంగా భారత పారిశ్రామిక వర్గాలు అమెరికాలో 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రణాళికలను ప్రకటించాయి. మరోవైపు, వచ్చే నెలలో జరగనున్న మధ్యంతర ఎన్నికల కోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఆ సభల్లో పెట్టుబడుల గురించి ప్రస్తావిస్తున్నారు. తన ప్రభుత్వ హయాంలో 20 ట్రిలియన్ డాలర్లకు పైగా విలువైన పెట్టుబడులు, పెట్టుబడి హామీలను సాధించామని చెబుతున్నారు.



# వర్షమే విజేత.. ఉత్కంఠ పోరుకు బ్రేక్!

- బెంగళూరు టీ20 నిర్ణయాత్మక మ్యాచ్ రద్దు.. 2-2తో ముగిసిన సిరీస్
- 46 బంతుల విధ్వంసం.. ఆ తర్వాత వరుణుడి ఆట!



నిర్ణయాత్మక పోరులో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని ఆశించిన భారత్, వెస్టిండీస్ జట్లకు వరుణుడు నిరాశ మిగిల్చాడు. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో శనివారం జరగాల్సిన ఐదో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2–2తో సమమైంది. అటు సిరీస్ విజేత ఎవరో తేలకపోగా.. ఇటు మైదానంలో భారత బ్యాటర్ల విధ్వంసకర ఆటను పూర్తిస్థాయిలో ఆస్వాదించే అవకాశం అభిమానులకు లేకుండా పోయింది. సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందుకున్నాడు.

### తొలుత ఆలస్యం.. ఆపై తొమ్మిది ఓవర్ల మ్యాచ్!

వర్షం, తడి అవుట్‌ఫీల్డ్ కారణంగా మ్యాచ్ ప్రారంభం ఆలస్యమైంది. వాతావరణం కాస్త అనుకూలించడంతో ఆటను తొమ్మిది ఓవర్లకు కుదించారు. టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో భారత బ్యాటర్లు స్వల్ప వ్యవధిలోనే భారీ స్కోరు సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

భారత ఓపెనర్లు దూకుడుగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. కేవలం 2.5 ఓవర్లలోనే టీమిండియా 50 పరుగుల మార్కును అందుకుంది. ఇషాన్ కిషన్ మెరుపు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతడు కేవలం 10 బంతుల్లోనే 30 పరుగులు సాధించి విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు.

### నామన్ ధీర్ మెరుపులు

ఇషాన్ కిషన్‌తోపాటు శ్రేయస్ అయ్యర్ కూడా వేగంగా పరుగులు సాధించాడు. శ్రేయస్ 22 పరుగులతో రాణించగా.. నామన్ ధీర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం ఆరు బంతుల్లోనే 24 పరుగులు చేసి భారత స్కోరుకు మరింత ఊపునిచ్చాడు. క్రీజులో ఉన్నంతసేపూ బౌండరీలు, సిక్సర్లతో అభిమానులను అలరించాడు. మరోవైపు కీమో పాల్, షమర్ స్ప్రింగర్ చెరో రెండు వికెట్లు తీసి భారత జోరుకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ టీమిండియా 7.4 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. ఆ సమయంలో మరోసారి వర్షం మొదలైంది.

### తగ్గని వాన.. అభిమానులకు నిరాశ

వర్షం కొంతసేపటికి తగ్గుతుందని, కనీసం ఐదు ఓవర్ల మ్యాచ్ అయినా జరుగుతుందని అభిమానులు ఆశించారు. మైదాన సిబ్బంది పరిస్థితులను పర్యవేక్షించినప్పటికీ వరుణుడు మాత్రం కనికరించలేదు. వెస్టిండీస్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు అవసరమైన సమయం ముగియడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. భారత్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించే అవకాశం వెస్టిండీస్‌కు దక్కలేదు. దీంతో సిరీస్ 2–2తో ముగిసింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టులోకి తిరిగొచ్చిన భువనేశ్వర్ కుమార్ బౌలింగ్ చేసే అవకాశం కూడా రాలేదు.

### హోప్ సారథ్యంలో విండీస్ పోరాటం

సిరీస్ ఆద్యంతం భారత్, వెస్టిండీస్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. తొలి మ్యాచ్‌లో భారత్ గెలవగా, రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ విజయం సాధించింది. మూడో మ్యాచ్‌ను భారత్ సొంతం చేసుకోగా, నాలుగో టీ20లో షై హోప్ అద్భుత శతకంతో విండీస్‌కు విజయాన్ని అందించాడు. దీంతో నిర్ణయాత్మక ఐదో మ్యాచ్ అనివార్యమైంది. చివరి పోరు వర్షార్పణం కావడంతో ఇరు జట్లు సిరీస్ విజయాన్ని పంచుకున్నాయి. మొత్తానికి.. బెంగళూరులో బ్యాటర్ల మెరుపులు కొద్దిసేపే కనిపించినా, వర్షం మాత్రం చివరివరకు తన ఆధిపత్యాన్ని చాటుకుంది. విజేతను నిర్ణయించాల్సిన మ్యాచ్‌లో ప్రకృతే పైచేయి సాధించడంతో అభిమానులకు అసంపూర్ణ క్రికెట్ అనుభవమే మిగిలింది.

## కివీస్ పేస్‌కు చెక్..
# గిల్ మాస్టర్ ప్లాన్!

**- రంజీ బరిలో టీమిండియా కెప్టెన్..**
**వ్యక్తిగత నెట్ బౌలర్లతో ప్రత్యేక సాధనకు సిద్ధం?**



న్యూజిలాండ్ పర్యటనకు ముందు టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తనదైన శైలిలో సన్నద్ధమవుతున్నాడు. అంతర్జాతీయ సిరీస్‌కు ముందు మ్యాచ్ ప్రాక్టీస్‌కు ప్రాధాన్య మిస్తూ రంజీ ట్రోఫీలో పంజాబ్ తరఫున బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. ఆదివారం ప్రారంభమయ్యే రెండో రౌండ్‌లో ఛత్తీస్‌గఢ్‌తో జరిగేమ్యాచ్‌లో ఆడనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

### ఐదుగురు నెట్ బౌలర్లు.. ప్రత్యేక వ్యూహం!

న్యూజిలాండ్ గడ్డపై పేస్ బౌలింగ్‌ను ఎదుర్కోవడం భారత బ్యాటర్లకు కీలక సవాలు కానుంది. ముఖ్యంగా టెస్టు సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలంటే ముందుగానే అక్కడి పరిస్థితు లకు అలవాటు పడటం అవసరం. ఈనేపథ్యంలో తన సాధన కోసం ఐదుగురు వ్యక్తిగత నెట్ బౌలర్లను న్యూజిలాండ్‌కు తీసుకెళ్లాలని గిల్ భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకు అయ్యే ఖర్చునుకూడా అతనే భరించనున్నట్లు క్రికెట్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వివరాలపై అధికారిక ధ్రువీకరణ అందుబాటులో లేదు.

### టెస్టు సన్నాహకాలపై దృష్టి

భారత్–న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా ఐదు టీ20లు అక్టోబర్ 22 నుంచి, ఐదు వన్డేలు నవంబర్ 4 నుంచి జరగనున్నాయి. అనంతరం నవంబర్ 19నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభమవుతుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27లో కీలకమైన ఈపోరులో మెరుగైన ఫలితం సాధించాలంటే బ్యాటింగ్,బౌలింగ్విభాగాల్లో సమష్టిగారాణించాలి. రంజీ మ్యాచ్ ద్వారా ప్రత్యర్థి బౌలింగ్‌ను ఎదుర్కొనేలయను అందిపుచ్చుకోవడంతోపాటు, ప్రత్యేక నెట్‌సాధనతో తన సాంకేతికతను మెరుగు పరుచుకోవాలని గిల్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. స్వదేశీ క్రికెట్ అనుభవాన్ని అంతర్జాతీయ సవాలుకు ఉపయోగించుకోవడం అతడికి ఎంతవరకు కలిసివస్తుందోచూడాలి.

## రెండు వారాలే అడ్డంకి..
# బోపన్నకు చేజారిన ఛాన్స్!



- ఏఐటీఏ అత్యుత్తమ క్రీడాకారుల జాబితాలో నో ప్లేస్
- పేస్‌కు టైర్-1.. భూపతి, సానియాకు టైర్-2లో చోటు

భారత టెన్నిస్ దిగ్గజం, ప్రపంచ మాజీ నంబర్ వన్ డబుల్స్ ఆటగాడు రోహన్‌బోపన్నకు అనూహ్య ఎదురుదెబ్బ తగిలింది. అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) రూపొందించిన 'స్పోర్ట్స్‌పర్సన్స్ ఆఫ్ ఔట్‌స్టాండింగ్ మెరిట్' (ఎస్ఓఎం) జాబితాలో అతడికి చోటు దక్కలేదు. దీనికి కారణం ప్రతిభలో లోపం కాదు.. రిటైర్మెంట్ నిబంధన! జాతీయ క్రీడా పాలన నిబంధనలు–2026 ప్రకారం ఈ జాబితాలో చోటు పొందాలంటే పోటీ క్రీడల నుంచి రిటైర్ అయి కనీసం ఏడాది పూర్తయి ఉండాలి. అక్టోబర్ 16న ఏఐటీఏ జాబితాను ప్రకటించగా.. బోపన్న రిటైర్మెంట్‌కు ఏడాది పూర్తవడానికి మరికొన్ని రోజులు సమయం ఉంది. దీంతో అతడి అవకాశం చేజారింది.

### భారత్‌కు 2024లోనే వీడ్కోలు

46 ఏళ్ల బోపన్న 2024 పారిస్ ఒలింపిక్స్ తర్వాత భారత్ తరఫున ఆడటానికి వీడ్కోలు పలికాడు. అయితే ప్రొఫెషనల్ టెన్నిస్‌లో మాత్రం కొనసాగాడు. చివరకు 2025 నవంబర్ 1న అంతర్జాతీయ ప్రొఫెషనల్ టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. నిబంధనల ప్రకారం భారత్ తరఫున ఆడటం ఆపినతేదీ కాకుండా,పోటీ క్రీడల నుంచి పూర్తిగా వైదొలిగినకాలాన్నే పరిగణనలోకి తీసుకున్నారు. తన అర్హతపై ఏఐటీఏ నిర్వాహకురాలు గీతామిత్తల్‌ను సంప్రదించిన తర్వాతే బోపన్న దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అయినప్పటికీ నిబంధనల ప్రకారం అర్హత సాధించలేకపోయాడు.

### దిగ్గజాలకు గుర్తింపు

మరోవైపు భారత టెన్నిస్ దిగ్గజాలు లియాండర్ పేస్, మహేశ్ భూపతి, సానియా మీర్జాలకు ఈ జాబితాలో చోటు లభించింది. మొత్తం 42 మంది పురుషులు, 28 మంది మహిళా క్రీడాకారులు దరఖాస్తు చేసుకోగా.. 20 మంది పురుషులు, 20 మంది మహిళలకు అవకాశం కల్పించారు. లియాండర్ పేస్‌కు మాత్రమే టైర్–1లో చోటు దక్కింది. మహేశ్ భూపతి, సానియా మీర్జా టైర్–2లో నిలిచారు.

### ఎన్నికల్లో కీలకం

ఈ జాబితాలో చోటు పొందిన 40 మంది క్రీడాకారులు ఏఐటీఏ ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర పోషించనున్నారు. వీరు ఎలక్టోరల్ కాలేజీగా వ్యవహరించి, సంఘం జనరల్ బాడీ, ఎగ్జిక్యూటివ్ కమిటీల్లో క్రీడాకారుల ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఓటు వేయనున్నారు. అర్హత కలిగిన వారు సంబంధిత ప్రతినిధి పదవులకు పోటీ చేసే అవకాశమూ ఉంటుంది. భారత టెన్నిస్‌కు విశేష సేవలందించిన బోపన్నకు నిబంధనల కారణంగా ఈసారి అవకాశం దక్కకపోవడం చర్చనీయాంశమైంది. అయితే అర్హతకు సంబంధించిన నిబంధనలు స్పష్టంగా అమలైతే, తదుపరి జాబితాలో చోటు దక్కించుకునే అవకాశం అతడికి ఉండనుంది.

## గోవాలో
# ఐపీఎల్-2027 వేలం

**డిసెంబర్ 16న ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీల పోటీ**
**ముందురోజే జట్లకు బ్రీఫింగ్.. మూడేళ్ల తర్వాత భారత్‌లో నిర్వహణ**

క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్–2027 ఆటగాళ్ల వేలానికి ముహూర్తం ఖరారైనట్లు సమాచారం. డిసెంబర్ 16న గోవా వేదికగా వేలం నిర్వహించనున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పది ఫ్రాంచైజీలకు సమాచారం ఇచ్చినట్లు పీటీఐ వార్తాసంస్థ వెల్లడించింది. వేలానికి ముందు రోజు, డిసెంబర్ 15న జట్ల ప్రతినిధులకు బ్రీఫింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది.

### మూడేళ్ల తర్వాత స్వదేశంలో..

గత మూడు సీజన్ల ఆటగాళ్ల వేలాలు విదేశాల్లో జరిగాయి. 2024 సీజన్‌కు సంబంధించిన వేలం దుబాయ్‌లో, 2025 సీజన్‌కు ముందు మెగా వేలం సౌదీ అరేబియాలోని జెడ్డాలో, 2026 సీజన్ వేలం అబుధాబిలో నిర్వహించారు. ఇప్పుడు ఐపీఎల్ వేలం మళ్లీ భారత్‌కు తిరిగి వస్తుండటంతో ఫ్రాంచైజీలతోపాటు అభిమానుల్లోనూ ఆసక్తి నెలకొంది.

### వ్యూహాలకు పదును పెట్టనున్న జట్లు

ఇది మినీ వేలం కావడంతో జట్లు తమ అవసరాలకు అనుగుణంగా ఆటగాళ్లను ఎంపిక చేసుకోవడంపై దృష్టి సారించనున్నాయి. ఇప్పటికే ఉన్న జట్టులో బలహీనతలను గుర్తించడం, అవసరమైన స్థానాలకు సరైన ఆటగాళ్లను తీసుకోవడం, అందుబాటులో ఉన్న బడ్జెట్‌ను సమర్థంగా వినియోగించడం ఫ్రాంచైజీలకు కీలకం కానుంది. దేశీయ ప్రతిభతో పాటు విదేశీ ఆటగాళ్ల లభ్యత, రిటెన్షన్ నిర్ణయాలు, ఆటగాళ్ల విడుదలవంటి అంశాలు వేలంలో జట్ల వ్యూహాలను ప్రభావితం చేయనున్నాయి. ముఖ్యంగా కీలక ఆటగాళ్ల కోసం జరిగే పోటీ, యువ క్రికెటర్లకు దక్కే అవకాశాలు ఈ వేలంలో ఆసక్తికరంగా మారనున్నాయి. డిసెంబర్ 15న జరిగే బ్రీఫింగ్‌లో వేలానికి సంబంధించిన వివరాలపై జట్లకు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే ఆటగాళ్ల జాబితాలు, ఫ్రాంచైజీల బడ్జెట్లు, వేలంలో పాల్గొనే ఆటగాళ్ల పూర్తి వివరాలపై మరింత సమాచారం రావాల్సి ఉంది. మొత్తంగా, గోవా వేదికగా జరగనున్న ఐపీఎల్–2027 వేలం తదుపరి సీజన్ జట్ల కూర్పును నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించనుంది. ఏ జట్టు తెలివైన కొనుగోళ్లతో బలపడుతుంది? ఏ ఆటగాడికి భారీ ధర దక్కుతుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.

చైతన్య రథం
సినిమా
ఆదివారం 18 అక్టోబరు 2026 X

# 'రౌడీ జనార్ధన' నుంచి కీర్తి ఫస్ట్‌లుక్



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న 'రౌడీ జనార్ధన' చిత్రం నుంచి హీరోయిన్ కీర్తిసురేష్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. కీర్తి సురేష్ పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ఈ పోస్టర్‌ను విడుదల చేసింది. ట్రెడిషనల్ లుక్‌లో పడవపై కూర్చున్న ఆమె ఎంతో అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తున్నారు. అయితే పోస్టర్‌లో విజయ్ దేవర కొండ లుక్‌ను ఉద్దేశపూర్వకంగా రివీల్ చేయకుండా ఆసక్తిని పెంచారు. రూరల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రానున్న ఈ చిత్రాన్ని 'రాజా వారు రాణి గారు' ఫేమ్ రవికిరణ్ కోలా తెరకెక్కిస్తున్నాడు.ప్రముఖ నిర్మాత దిల్ రాజు, శిరీష్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. కీర్తి సురేష్ పాత్ర హీరోలోని అందమైన కోణాన్ని ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ అందమైన సినిమాటిక్ అనుభూతిని ఇస్తుందని చిత్రబృందం చెబుతోంది.

### ఇటు లతారెడ్డిగా..

టాలెంటెడ్ హీరోయిన్ కీర్తి సురేశ్ పుట్టినరోజు సందర్భంగా 'జనవరి 12 విడుదల'చిత్రబృందం ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఆసక్తికర పోస్టర్‌ను షేర్ చేసింది.ఈ సంక్రాంతికి ఆమె 'లతారెడ్డి'అనే సరికొత్తశక్తివంతమైన పాత్రలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.వెంకటేశ్ హీరోగా,నందమూరి కల్యాణ్‌రామ్ కీలక పాత్రలో, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈచిత్రం 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకానుంది.మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈచిత్రంలో కీర్తిసురేశ్ పాత్ర సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని తెలుస్తోంది.

### వైలెంట్ టర్న్ తీసుకున్న కీర్తి..

కీర్తి సురేష్ ప్రధాన పాత్ర పోషిస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'అక్క' టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకుల ముందుకు రానున్న యాక్షన్ ప్రాజెక్టు.. ఉత్కంఠభరిత సన్నివేశాలతో ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో మరో ప్రముఖ నటి రాధికా ఆప్టే కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇద్దరు ప్రతిభావంతులైన నటీమణులు కలిసి నటిస్తుండటంతో ఈ థ్రిల్లర్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. సరికొత్త లుక్‌లో కనిపించిన కీర్తి సురేశ్, యాక్షన్ సన్నివేశాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. టీజర్ విడుదలతో సినిమాపై అంచనాలుమరింత పెరిగాయి. విభిన్నమైన కథాంశం, ఉత్కంఠభరితమైన కథనంతో రూపొందుతున్న 'అక్క' నేరుగా ఓటీటీలో విడుదల కానుంది. ఈ చిత్రం అక్టోబర్ 30నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్టు సమాచారం.



# భక్తుడిగా అల్లరి నరేష్: 'కనకదుర్గ' ఫస్ట్ లుక్ విడుదల




టాలీవుడ్‌లో తనదైన కామెడీ సినిమాలతో అలరించిన అల్లరి నరేష్, ఇటీవల పలు సీరియస్ సబ్జెక్టులతోనూ ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తనలోని నటుడిని మరింత విస్తరించాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి కథలను ఎంచుకుంటున్నారు. ఆయన నుంచి రాబోతున్న తాజాచిత్రం 'కనకదుర్గ'.నవరాత్రి సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. టైటిల్‌కు తగ్గట్టుగా పోస్టర్‌లో నరేష్ భవానీ భక్తుడిగా,కాషాయ రంగు దుస్తుల్లో ఆనందంగా నృత్యం చేస్తూ కనిపిస్తున్నారు. దసరా సీజన్‌లో విడుదలైన ఈ లుక్ ఇప్పుడు ఆకట్టుకుంటోంది. "ప్రతి ప్రార్థనలోనూ ఒక శక్తి ఉంటుంది. ఈ నవరాత్రి వేళ దైవిక స్త్రీ శక్తిని ఆరాధిస్తూ అమ్మవారి ఆశీస్సులు కోరుతూ 'కనకదుర్గ'ను పరిచయం చేస్తున్నాం" అంటూ మేకర్స్ పోస్టర్‌కు క్యాప్షన్ జత చేశారు. ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్న ఈ భక్తి ప్రధాన చిత్రానికి బీవీఎన్ రవి కథ, కథనం అందిస్తున్నారు. ఇందులో నరేష్ సరసన కాజల్ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. సుబ్బరాజు కీలక పాత్ర పోషిస్తున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో టెంపుల్ టౌన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం, శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. థమన్ సంగీతం అందిస్తున్నారు. ఫస్ట్ సింగిల్‌ను అతి త్వరలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ధ్రువీకరించారు. ఈ డివోషనల్ డ్రామాకు థమన్ ఎలాంటి బీట్స్ అందించారో చూడాలి.

# షారుక్‌లాంటి రొమాంటిక్ లైఫ్‌లో తగల్లేదు

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ సినిమాలు తనపై ఎంతో ప్రభావం చూపాయని నటి మృణాల్ ఠాకూర్ వెల్లడించారు. ముఖ్యంగా ఆయన తెరపై పండించిన రొమాన్స్ ప్రేమపై తన అంచనాలను పెంచిందని తెలిపారు. తన జీవితంలో షారుక్ ఖాన్ లేరనే విషయం బాధ కలిగిస్తోందంటూ సరదాగా వ్యాఖ్యానించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "నా జీవితంలో షారుక్ ఖాన్ లేరనే విషయం మనసును ముక్కలు చేస్తోంది.రొమాన్స్ విషయంలో ఆయన సృష్టించిన ప్రమాణాల గురించి ఎంత చెప్పినా తక్కువే. షారుక్ సర్ అంటే నాకుఎంతో ఇష్టం. తెరపై ఆయన పోషించిన రొమాంటిక్ పాత్రలంటే చాలా అభిమానం. ఆయనలా రొమాంటిక్‌గా ఉండే వ్యక్తిని ఇప్పటివరకు నేను కలవలేదు" అని మృణాల్ పేర్కొన్నారు. పాత సినిమాల్లోని ప్రేమ సన్నివేశాలకు, ప్రస్తుత కాలంలోని కథనాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కూడా ఆమె వివరించారు. అప్పటి సామాజిక పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులు వేర్వేరని అభిప్రాయపడ్డారు. గతంలో సోషల్ మీడియా ప్రభావం తక్కువగా ఉండేదని, ఇప్పుడు



మహిళలకు తమ జీవితాలకు సంబంధించి మరిన్ని ఎంపికలు చేసుకునే స్వేచ్ఛ ఉందని చెప్పారు. ప్రస్తుత కాలంలో పుట్టినందుకు సంతోషంగా ఉందన్నారు. సినిమాలను చూసే విధానం ఒక్కొక్కరికి ఒక్కోలా ఉంటుందని, కొందరు వాటి నుంచి పాఠాలు నేర్చుకుంటే మరికొందరు వినోదంగానే చూస్తారని మృణాల్ అభిప్రాయపడ్డారు. ఇక సినిమాల విషయానికొస్తే.. మృణాల్ ఇటీవల క్రైమ్ థ్రిల్లర్ 'పూజా మేరీ జాన్'లో నటించారు. ఇందులో హ్యూమా ఖురేషి, విజయ్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# సంగీత దర్శకుడు దేవా కన్నుమూత

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ సీనియర్ సంగీత దర్శకుడు, గాయకుడు దేవా (75) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. 'తేనిసై తెండ్రల్'గా పేరొందిన దేవా



మరణంతో సంగీత ప్రపంచం విషాదంలో మునిగిపోయింది. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో 400కు పైగా చిత్రాలకు సంగీతం అందించిన దేవా, తనదైన బాణీలతో ప్రేక్షకులను అలరించారు. ముఖ్యంగా తమిళ జానపద సంగీత శైలి 'గానా'ను సినిమాల్లో ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. మాస్ బీట్స్‌తో పాటు మధురమైన పాటలతోనూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు సైతం ఆయన సంగీతం సుపరిచితమే. చిరంజీవి నటించిన 'మాస్టర్', పవన్ కళ్యాణ్ 'తొలిప్రేమ', రజనీకాంత్ 'బాషా', 'ఖుషి' వంటి చిత్రాలతో తెలుగు సినీ అభిమానులకు చేరువయ్యారు. దేవా వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆయన కుమారుడు శ్రీకాంత్ దేవా సంగీత దర్శకుడిగా రాణిస్తున్నారు. ఆయన సోదరులు సబేష్, మురళి కూడా సంగీత దర్శకులుగా గుర్తింపు పొందారు. దేవా మృతిపట్ల సినీ ప్రముఖులు, సంగీత అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తూ ఆయనకు నివాళులర్పిస్తున్నారు.

# టీజర్‌లో 'ఐ హేట్ మ్యారేజ్'

ప్రేమ, పెళ్లి, కెరీర్, స్వతంత్ర జీవనంపై నేటి యువత ఆలోచనలను ప్రతిబింబిస్తూ రూపొందుతున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ఐ హేట్ మ్యారేజ్' టీజర్ తాజాగా విడుదలైంది. సుగి విజయ్, జుప్సీ భద్ర జంటగా నటిస్తున్న చిత్రంతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన 'అప్పుడే పెళ్లా' లిరికల్ వీడియో సాంగ్ సోషల్ మీడియాలో విశేష స్పందనను సొంతం చేసుకుని ట్రెండింగ్‌లో నిలిచింది. టీజర్ విడుదల సందర్భంగా దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల మాట్లాడుతూ, నేటి జెన్ జెడ్ యువత ప్రేమ, పెళ్లి, కెరీర్, వ్యక్తిగత స్వేచ్ఛపై కలిగి ఉన్న ఆలోచనలు, భావోద్వేగాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నమే ఈ చిత్రమని తెలిపారు. యువత తమను తాము సినిమాలోని పాత్రల్లో చూసుకునేలా కథను రూపొందించామని, కొత్తదనాన్ని కోరుకునే ప్రేక్షకులకు ఈ చిత్రం ప్రత్యేక అనుభూతిని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలకపాత్రలు పోషిస్తున్నారు. విజయ్ సి.కుమార్ ఛాయాగ్రహణం అందించగా, వరికుప్పల యాదగిరి సంగీతం సమకూర్చారు. ప్రవీణ్ ఇమ్మడి నేపథ్య సంగీతం, ఆవుల వెంకటేష్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. దయానంద్ మాదం, కార్తిక్ వెంపటి నిర్మాతలుగా, సంతోష్ రేణికుంట్ల, కాశీగారి కోదండ రామ శర్మ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.



# ఆకట్టుకున్న 'ఆకాశంలో ఒక తార'

టాలెంటెడ్ హీరో దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆకాశంలో ఒక తార'. పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. టీజర్‌లో కథానాయిక సాత్విక వీరవల్లి పాత్రకు కూడా సమాన ప్రాధాన్యం కనిపించడం విశేషం. కట్టుబాట్లను అధిగమించి, తన కలను సాకారం



చేసుకునేందుకు ఊరి పొలిమేరలు దాటి ఆకాశమే హద్దుగా ముందుకు సాగే ఓ ధైర్యవంతురాలైన యువతి కథాంశంతో ఈ చిత్రం రూపొందినట్లు టీజర్ సూచిస్తోంది. దుల్కర్ సల్మాన్ తనదైన నటనతో ఆకట్టుకోగా, సాత్విక వీరవల్లి ఆత్మవిశ్వాసంతో కూడిన పాత్రలో కనిపించి సినిమాపై ఆసక్తిని పెంచారు. ఆకట్టుకునే విజువల్స్, సందర్భానికి తగిన సంగీతం టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్ బాక్స్ మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. టీజర్‌తో అంచనాలు పెంచిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.